ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 15 మే 2024

ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 27.0



ప్రదక్షిణలు చేస్తున్న పుట్టా మహేష్

శ్రీవారికి కూటమి అభ్యర్థుల పూజలు

ద్వారకా తిరుమల, మే 14: ఇన్ని రోజులూ ప్రచారంలో మునిగి తేలిన అభ్యర్థులు మంగళవారం ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఏలూరు ఎంపీ కూటమి టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్, ఉంగుటూరు జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు శ్రీవారికి పూజలు చేశారు. పండితుల నుంచి వేదాశీర్వచనం పొందారు. అనంతరం స్థానిక వైష్ణవీ హోటల్‌లో మహేష్ యాదవ్ విలేకర్లతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో ప్రజలు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరి గంటల తరబడి నిలబడి ఓట్లు వేశారని కూటమి అన్నిచోట్ల అఖండ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు. ఎన్నికల సమయంలో తాను హామీ ఇచ్చిన ప్రతీ పనిని పూర్తి చేసి చూపిస్తానన్నారు. టీడీపీ నాయకులు నేతలు సంకువల్లి బ్రహ్మయ్య, ఇమ్మడి రత్నాజి, కూరాకుల బుజ్జియాదవ్, రేవూరి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.



దర్శనానంతరం బయటకు వస్తున్న ఉంగుటూరు కూటమి అభ్యర్థి ధర్మరాజు

పోలింగ్ ముగిసింది..
తీర్పు మిగిలింది !



పోలింగ్ ముగిసింది... ఓటర్ల తీర్పు ఈవీఎంలలో భద్రంగా ఉంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగే రోజున అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. గెలుపు, ఓటములపై ఇప్పుడు అందరూ లెక్కలు కట్టే పనిలో ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎవరికి అనుకూలత, మరెక్కడ అంచనాలు తారుమారు ? ఏ వైపు నుంచి నష్టం వచ్చింది అంటూ ఎవరికి వారు ఆరా తీస్తున్నారు. గెలుపు, ఓటములపై మరోవైపు భారీ బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఏలూరు లోక్‌సభ పరిధిలో ఏ పార్టీకి ఎన్నిసీట్లు దక్కుతాయో ? అనే దానిపై పందేలు జోరుగా సాగుతున్నాయి.

గోదావరి తీరాన భారీ పోలింగ్

- మహిళా ఓటర్లు ఎటువైపో అంటూ తర్జనభర్జనలు
- ఓటర్ తీర్పు ఈవీఎం బాక్సుల్లో భద్రం
- ఫలితం కోసం 20 రోజులు ఆగాల్సిందే..
- రంగంలోకి బెట్టింగ్ రాయుళ్లు
- అభ్యర్థుల బలా బలాలపై ఆరాలు

ఏలూరులో సోమవారం ఎన్నికల్లో మహిళా ఓటర్ల క్యూ →



ఏలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): సోమవారం జరిగిన సాధారణ ఎన్నికల పోలింగ్ సరళిపై ఎవరి అంచనాలు వారికున్నాయి. భారీగా ఓట్లు పోలవడం తమకే సానుకూలమంటే ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ భారీగానే జరిగింది. రాత్రి 11 గంటల వరకు చాలా ప్రాంతాల్లో ఓటర్లు ఓటే వేసేందుకు క్యూలో ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో మహిళల పాత్రపైన అందరికి సస్పెన్స్ నెలకొంది. గతంలో పోలింగ్ ప్రారంభమైన మరుక్షణమే పెద్దఎత్తున మహిళలు బారులు తీరేవారు. తమ ఓటుహక్కు వినియోగించు కోవడానికి తాప త్రయ పడేవారు. ఈ దిశగానే అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ మహిళలు సీనియర్ సిటిజన్స్ సంఖ్యే అత్యధికంగా కనిపించేది. కాని ఈసారి సీన్ తిరగబడింది. మహిళా ఓటర్లు ఉదయం పూట పలుచగా, మధ్యాహ్నం 3.30 నుంచి అత్యధికంగా పోలింగ్ కేంద్రాలకు ఒక్కసారిగా తరలిరావడం, ప్రధానపక్షాలతో పాటు అందర్ని తికమక పెడుతోంది. సాధారణంగా ఏ ఎన్నికల్లో అయినా మహిళా ఓటర్ల తీర్పుపైనే ఆధార పడుతోంది. ఈసారి కూడా మహిళలు పెద్దసంఖ్యలో తరలిరావడమే కాకుండా గంటల తరబడి ఓటు వేసేందుకు నిరీక్షించారు. వీరంతా డ్వాక్రా సంఘాల సభ్యు లేనని ఆ కారణంగానే కూడబలుక్కొని ఒకేసారి పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చా రంటూ వైసీపీ సరికొత్త వాదనలు ఆరంభించింది. ఈ ఐదేళ్లలో అమలైన పథకాల పట్ల మహిళల్లో సానుకూలత ఉండబట్టే ఆ ఓటింగ్ అంతా తమకు అనుకూలంగా పడిందంటూ వైసీపీ విశ్లేషిస్తోంది. కాని దీనికి భిన్నంగా మహిళలు పడరాని పాట్లు పడ్డారు. కుటుంబాల్లో ఆర్థిక వెలితి, మద్యనిషేదం అమలు కాకపోవడం, ధరలు చుక్కలను అంటడం వంటి పరిణామాలు మహిళల్లో అసంతృప్తికి దారితీయడమే కాకుండా మార్పుకోసమే వారంతా చివరి క్షణాల్లో కూడా ఓటు వినియోగించు కోవడానికే ప్రాధాన్యం ఇచ్చారని కూటమి భావిస్తోంది. మహిళా ఓటర్లు తీర్పు తమకు అనుకూలంగా ఉందని ఈ రెండుపక్షాలు గట్టి విశ్వాసంతో ఉన్నాయి.

మరో ఇరవై రోజులు ఆగాలి

మరో 20 రోజుల వరకు ఎవరివైపు ఓటర్ తీర్పు ఇచ్చారో ఎదురు చూడాల్సిందే. పోలింగ్ ముగిసి 24 గంటలు కాక మునుపే నియోజకవర్గాల వారీగా ఎవరికెంత బలం? బలహీనత అనే దానిపై అభ్యర్థులు ఆరా తీస్తున్నారు. పోలింగ్‌కి భారీ ఎత్తున ఓటర్లు హాజరవ్వడం అది ఏ పార్టీకి నష్టమో, లాభమో తేల్చటానికి ముప్పుతిప్పలు పడుతున్నారు. గ్రామాల వారీగా తమకు పడిన ఓట్లశాతంపై ఎవరిలెక్కలు వారివే. దాదాపు ఏలూరు మినహా మిగతా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం 80కి దాటేసింది. ఈ పరిణామం దాదాపు ఎవరూ ఊహించనిదే. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో 2014లో 82.76 శాతం, 2019లో 83.75 శాతం తాజాగా జరిగిన ఎన్నికల్లో 83.65 శాతం మేర పోలింగ్ నమోదైంది. ఈ ఒరవడిలోనే నియోజకవర్గాల్లో పోలింగ్ శాతాల్లో కూడా మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. గడిచిన 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి లోక్‌సభ పరిధిలో పెద్దగా పెరగకపోయినా నియోజక వర్గాల స్థాయిలో మాత్రం పోలైన ఓట్లశాతంలో ఎగుడుదిగుడులు ఉన్నాయి.

ఇది ఎవరికి సానుకూలమో ?

సోమవారం జరిగిన పోలింగ్‌ను సుదీర్ఘంగా విశ్లేషిస్తున్నారు. గతంలో కంటే భిన్నంగా ఈసారి యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో తమ ఓటుహక్కును వినియోగించు కున్నారని, ఉద్యోగులు సైతం ఇదే దారిలో పయనించారని, ఈ క్రమంలోనే ప్రభుత్వ వ్యతిరేకత బయట పడుతుందని అంటున్నారు. ఇదంతా తమకే కలిసివస్తుందని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భావిస్తోంది. గతంలో పోలింగ్ జరిగినప్పుడు నెలకొన్న పరిస్థితులు వేరు.. చాలా ఈసారి జరిగిన పోలింగ్‌లో ఓటర్లు కసితో ఓటింగ్‌కు దిగారని ఇంకో అంచనా. దీనికి తగినట్లుగానే పల్లె, పట్టణం తేడా లేకుండా పెద్దఎత్తున ఓటర్లు క్యూలో గంటల తరబడి వేచి ఉండటం, సౌకర్యాలు లేకపోయినా సహనం కోల్పోకుండా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా జాగ్రత్త పడ్డారు. ఇదొక శుభపరిణామంగా కూటమి అభ్యర్థులు భావిస్తుండగా వైసీపీ మాత్రం పథకాల ప్రభావమే పెద్దఎత్తున మహిళలు తాము ఓటుహక్కును వినియోగించుకోవడానికి పోటీ పడ్డారని ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని ఆ పార్టీ వాదిస్తోంది. ఓటింగ్ సరళి, సాగిన తీరు తమకే అనుకూలంగా ఉందంటూ మంగళవారం అంతా కూటమి ఒకవైపు, వైసీపీ ఇంకోవైపు వాదనలు కూడా దిగుతున్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఏ పార్టీకి అనుకూలత అనేదానిపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చేలా మరోవైపు తలపండిన రాజకీయ నాయకులే విశ్లేషిస్తున్నారు.

కాయ్ రాజా కాయ్

ఎవరికి ఎన్ని ? ఎక్కడెక్కడ ?

బెట్టింగ్ రాయుళ్ల జోరు



ఏ పందేనికి అయినా గోదావరి జిల్లాలకు పెట్టింది పేరు. ఈసారి కూడా సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోనూ ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లాలోనూ ఏ పార్టీకి ఎన్నిసీట్లు, మెజార్టీ ఎంత? ఎంపీస్థానంలో ఎవరికి దక్కుతాయంటూ పందేలు జోరందుకున్నాయి. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో అత్యధిక మెజార్టీ సీట్లు కూటమికే దక్కుతాయని బెట్టింగ్‌లు అందు కున్నాయి. సుమారు రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పందేలు జోరుగానే సాగుతున్నాయి. ప్రత్యేకించి చింతమనేని ప్రభాకర్ పోటీచేసిన దెందులూరుపైన, జనసేన పక్షాన పోటీ పడుతున్న ఉంగుటూరు నియోజకవర్గంపైన ఈ బెట్టింగ్‌లు భారీగా జరుగుతున్నాయి. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారే ఈ పందేల్లో ఉత్సాహపడటం ఇంకో విశేషం. మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు స్థానాలు కూటమికి లభిస్తాయని కొందరు...కాదు ఐదుస్థానాలే అంటూ ఇంకొందరు రసవత్తరంగా బెట్టింగ్‌లకు దిగారు. ఉమ్మడి, పశ్చిమగోదావరి జిల్లాలో జనసేనకు ఎన్ని సీట్లు వస్తాయనే దానిపైన బెట్టింగ్‌లకు అంతూపంతూ లేదు. ఏలూరు ఎంపీ స్థానం పుట్టామహేష్ దక్కించుకుంటారంటూ పందేలు జోరుగా ఊపందుకున్నాయి. గెలిచే ఎమ్మెల్యే స్థానాలపై అత్యధికంగా రూ.15 లక్షలు, అత్యల్పంగా రూ.4 లక్షలుగా వినబడుతోంది. ఎంపీస్థానంలో గెలుపు ఎవరిది అనే దానిపై రూ. 5 లక్షల నుంచి 10 లక్షల్లోపు బెట్టింగ్‌లు ఉన్నాయి.



కలెక్టర్ వెంకటేష్ సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌కి సీల్ వేస్తున్న ఎన్నికల సిబ్బంది

ఓటు భద్రం !

స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్న ఈవీఎంలు

ఏలూరుసిటీ, మే 14: పోలింగ్ ముగిసింది. ఈ ఎన్నికలలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ జరిగింది. కొన్ని ప్రాంతాల్లో అర్ధరాత్రి దాటిన తరువాత కూడా పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు. దీంతో పోలింగ్ సామగ్రి స్ట్రాంగ్ రూమ్‌లకు చేరేందుకు తెల్లవారుజాము వరకు సమయం పట్టిందని చెబుతున్నారు. ఏలూరు జిల్లా వట్లూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు చేరుకున్నాయి. జిల్లాకు సంబంధించి 1,744 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను ఇక్కడ భద్రపరచటం జరిగింది. ఈవీఎంలను మూడంచెల భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.ఓటింగ్ ప్రక్రియ ముగియగానే సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సీల్ వేసిన ఈవీఎంలు,వీవీ ప్యాట్‌లు జీపీఎస్ అనుసంధానం చేసిన ట్రాకింగ్ వాహనాలలో ఏలూరు చేరుకున్నాయి. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. కేంద్ర పారా మిలటరీ భద్రతా బలగాలు ఉంటాయి. రెండవ అంచెలో రాష్ట్ర రిజర్వ్ భద్రతా దళాలు, మూడవ అంచెలో స్థానిక పోలీస్ ఫోర్స్ భద్రత అందిస్తున్నాయి. స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలను పోలింగ్ సిబ్బంది, ఏజెంట్లు, వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో సీల్ వేసి కేంద్ర భద్రతా బలగాలకు అప్పగించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) కేంద్ర భద్రతా దళాలు పహారా కాస్తుండగా, దాని వెలుపల రాష్ట్ర రిజర్వు పోలీస్ దళాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయి.

జయహో ఓటరు

జిల్లాలో 83.65 శాతం పోలింగ్
అత్యధికంగా నూజివీడు నియోజకవర్గంలో 87.94 శాతం
పొద్దుపోయేవరకు సాగిన పోలింగ్



ఏలూరులో సోమవారం జరిగిన ఎన్నికల్లో క్యూలైన్లలో ఓటర్లు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
ఉంగుటూరు	214	2,06,437	1,81,164	87.76
దెందులూరు	239	2,24,013	1,92,901	86.11
ఏలూరు	213	2,35,345	1,65,132	70.16
పోలవరం	284	2,53,981	2,18,366	85.98
చింతలపూడి	273	2,73,069	2,22,608	81.52
నూజివీడు	286	2,38,981	2,10,155	87.94
కైకలూరు	235	2,05,604	1,79,536	87.32
మొత్తం	1,744	16,37,430	12,28,973	

ఏలూరు సిటీ, మే 14: సార్వత్రిక ఎన్నికలలో సోమవారం జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ఉవ్వెత్తున సాగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో సోమ వారం రాత్రి పొద్దుపోయే వరకు పోలింగ్ జరిగిందని చెబుతున్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో జిల్లాలో మొత్తం 83.65 శాతం పోలింగ్ జరిగింది. జిల్లాలో 16,37,430 మంది ఓటర్లు ఉండగా ఇందులో సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రక్రియలో 13,69,862 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 6,76,639 మంది పురుష ఓటర్లు, 6,93,172 మంది మహిళలు, ఇతరులు 51 మంది తమ ఓటు వేశారు. అత్యధికంగా నూజివీడు అసెంబ్లీ నియోజక వర్గంలో 87.94 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి దేశ, విదేశాల నుంచి కేవలం ఓట్లు వేసేందుకు రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. హైద్రాబాద్, బెంగుళూరు, చెన్నై ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో తమ ప్రాంతాలకు వచ్చి ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. తొలిసారిగా ఓటుహక్కు పొందిన యువ ఓటర్లలో చైతన్యం రావటంతో వారు పోలింగ్ కేంద్రాలకు ఉదయం నుంచే క్యూ కట్టి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాధారణంగా కేవలం సంక్రాంతి సమయంలోనే తమ స్వస్థలాలకు ప్రజలు వచ్చే అవకాశం ఉండటంతో అప్పుడు రద్దీ ఎక్కువగా కనిపించేది. ఇప్పుడు సంక్రాంతి పండుగ మాదిరిగానే ఓట్ల పండుగ కోసం ఓటర్లు వివిధ ప్రాంతాల, నుంచి ఇక్కడకు రావడంతో బస్సులు, రైళ్ళు రద్దీగా కనిపించాయి.

మూడంచెల భద్రత

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఈవీఎంలను మూడంచెల భద్రత వ్యవస్థల మధ్య భద్రపరిచినట్టు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. జిల్లాలో సోమవారం ఏలూరు పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజక వర్గాలకు పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగాయన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరిచే కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం వరకు జిల్లా కలెక్టర్ దగ్గరుండి పర్య వేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తీసుకున్న పటిష్టమైన చర్యలు కారణంగా పోలింగ్ సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు పడకుండా పోలింగ్ ముగిసిందన్నారు. ఈవీఎంలను మూడంచెల భద్రతా ఏర్పాట్ల మధ్య భద్రపరిచాన్నారు. జూన్ 4న ఏలూరు సీఆర్ఆర్ ఇంజ నీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పోలింగ్ నిర్వహణలో సహకరించిన అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఏ రామన్, ఎస్పీ మేరీ ప్రశాంతి, జేసీ లావణ్యవేణి , ఐటీడీఏ పీవో సూర్యతేజ ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎవరినీ వదలం

కార్యకర్తలను కాపాడుకుంటాం
గాయాలైనవారికి టీడీపీ పరామర్శ



మహేష్ యాదవ్

ఏలూరు క్రైం, మే 14 : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను కాపాడు కోవడానికి తాము చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ, ఉమ్మడి కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు, దెందులూరు మండలం సోమ వరప్పాడులో వైసీపీ నాయకుల దాడిలో గాయాలపాలైన టీడీపీ కార్యకర్తలు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఉదయం మహేష్ యాదవ్ పరామర్శించి ఆత్మస్థైర్యం కల్పించారు. 20 రోజుల్లో టీడీపీ ప్రభుత్వం వస్తుందని వచ్చిన తరువాత ఐదేళ్ల నుంచి అరాచకాలు చేసిన ఏ ఒక్కరిని వదిలిపెట్టబోమని ఖచ్చితంగా చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

- ఓటమి భయంతోనే దాడులకు టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డారని దెందులూరు నియోజకవర్గ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందు లూరు నియోజకవర్గంలో పలుగ్రామాల్లో టీడీపీ కార్యకర్తలపై జరిగిన దాడుల్లో గాయాలపాలైన వారిని ఆయన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో దాడి చేసి ఓటర్లను భయపెట్టి ఓట్లను ఆక్రమించాలని చూసిన వైసీపీకి ప్రజలు తమ ఓటుతో తగిన గుణపాఠం చెప్పారన్నారు. తప్పు చేసిన వారందరికి చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.
- వైసీపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని ఏలూరు తెలుగుదేశం పార్టీ ఉమ్మడి కూటమి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. వివిధ గ్రామాల్లో వైసీపీ నాయకుల దాడితో గాయపడి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను బడేటి చంటి పరామర్శించారు.



గాయపడి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్యకర్తలను పరామర్శిస్తున్న బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్



దాడిచేసిన వారిపై కేసులు



చాటపర్రులో వైసీపీ నాయకుల దాడి..

టీడీపీ తరపున ప్రచారం చేస్తున్న వ్యక్తిపై దాడి చేసిన వైసీపీకి చెందినవారిపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.ఏలూరు మునిసిపల్ పరిధిలోని పోణంగి గ్రామానికి చెందిన వేమూరి రాజు ఈనెల 13వ తేదీన ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసి టీడీపీ తరఫున ప్రచారం చేస్తుండగా వైసీపీకి చెందిన గేదెల సూర్య ప్రకాష్, బొంకుర అప్పలకొండ, చిలి చైతన్య మరికొంతమంది కలిసి దాడి చేశారు. చైతన్య గాజుపెంకుతో రాజు మెడపై కోశాడు. దీనిపై పోలీసులు వారందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

- ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామానికి చెందిన కావారి శ్రీనాధ్ చౌదరి గ్రామ టీడీపీ పార్టీ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఈనెల 13న ఎన్నికలు సందర్భంగా తన ఇంట్లో టీడీపీ కార్యకర్తల సమావేశమై ఉండగా అదే గ్రామానికి వైసీపీకి చెందిన పరిమి ప్రభుచరణ్ మరికొంత మంది కలిసి ఇంట్లోకి చొరబడి వారిపై దాడి చేసి ఇంట్లో కుర్చీలను ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై శ్రీనాధ్ చౌదరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాం : ఎస్పీ



అందరి సహకారంతోనే జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించ గలిగామని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి రెండు చెదురుమదురు సంఘటనలు మినహా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ యంత్రాంగం, మీడియా, ప్రజలు సహాయ సహకారాలు అందించడం వల్లే సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించగలిగామని చెప్పారు.



కూటమి నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఈవీఎంలు తరలించేశారు

భీమవరంలో కూటమి నాయకుల ఆందోళన

రిజర్వ్ ఈవీఎంలని కలెక్టర్ వివరణ

భీమవరం టౌన్, మే 14: పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎంల తరలింపులో గందరగోళం నెలకొంది. ఈవీఎంలు తరలింపులో వాహనం మధ్యలో నిలచిపోవడంతో కూటమి నాయకులు ఆందోళనకు దిగారు. భీమవరం సమీపంలోని ఎస్ఆర్కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద సోమవారం అర్ధరాత్రి బీజేపీ ఎంపీ అభ్యర్థి భూపతి రాజు శ్రీనివాసవర్మ ఆందోళనకు దిగారు. ఈవీఎంలు పనిచెయ్యకపోతే పంపే రిజర్వు ఈవీఎంల వాహనం నిలచిపోయిందని, పోలింగ్ జరిగిన ఈవీఎంలు కాదని కూటమి నాయకులకు కలెక్టర్ సుమిత్ కుమార్ వివరించారు. నిలచిపోయిన వాహనంకు సంబంధి వీడియోతీసి వైరల్ చెయ్యడంతో కూటమి నాయకులు ఆందోళనకు దిగారు. రిజర్వ్ ఈవీఎం వెహికల్‌పై గందరగోళ పరిస్థితి వాస్తవ పరిస్థితిని వివరించిన జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను వివరించి అనుమానాలను నివృత్తి చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది.

వైసీపీ కుట్రలు విఫలం

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం, మే 14: వైసీపీ కుట్రలు విఫలమయ్యాయని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. పిఠాపురం నుంచి పోటీ చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఎంత మెజార్టీ ఇస్తారనేది ప్రజల నిర్ణయంమని, ప్రజలకు ఏమి చేస్తాం, ఎంత అభివృద్ధి చేస్తామనేదే పార్టీకి ముఖ్యమని తెలిపారు. కుమారపురంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి పవన్‌కల్యాణ్ బాధ్యతాయుతమైన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. శ్రామికులు స్వేదం తుడుచుకోవడానికి వాడే కాశీ తువ్వాలుపై కూడా వైసీపీ చేసిన కుట్రలు విఫలమయ్యాయని చెప్పారు. పవన్ జనసేన అధ్యక్షుడి హోదాలో రాష్ట్రవ్యాప్తంగా జనసేనతో పాటు కూటమి తరపున ప్రచారం నిర్వహించారని తెలిపారు. పిఠాపురానికి పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేని పరిస్థితుల్లో జనసైనికులు, వీరమహిళలు అహర్నిశలు శ్రమించారని తెలిపారు. పవన్ కోసం రాష్ట్రం నుంచే గాక తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి ఎంతో మంది స్వచ్ఛందంగా వచ్చి ప్రచారం నిర్వహించారన్నారు. పవన్‌ను నిలబెట్టుకోవడానికి, గెలిపించుకునేందుకు పిఠాపురం ప్రజలు పరితపించిన తీరు తమకు సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. వైసీపీ దుర్మార్గ పాలనను తరిమికొట్టేందుకు ప్రజలంతా రాష్ట్రవ్యాప్తంగా బయటకు వచ్చి ఓటు వేశారన్నారు. మర్రెడ్డి శ్రీనివాసరావు, వేములపాటి అజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఎ కార్యదర్శి రత్న ప్రసాద్

పెండింగ్ కేసులు రాజీ చేయాలి

ఏలూరు క్రైం, మే 14: కోర్టులలో కేసులు విపరీతంగా పెరిగిపోవడంతో వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన రాజీ పరిష్కారం చేయాలని న్యాయమూర్తులు, న్యాయవాదులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ సూచించారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో వివాద పరిష్కార ప్రత్యామ్నాయం, మధ్యవర్తిత్వం అంశంపై న్యాయవాదులకు ఒక్క రోజు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ న్యాయవాదులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కానాల రామకృష్ణారావు, తిగిరిపల్లి సుబ్బారావు, రత్నరాజులు పాల్గొన్నారు. ఏలూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్ఎంఎం నాగరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.



నౌడూరు ఫ్లాగ్ టవర్ వద్ద కుసుమను సత్కరిస్తున్న వడ్డి సుబ్బారావు

బంగారు పతక విజేత కుసుమకు సత్కారం

భీమవరం రూరల్, మే 14: వీరవాసరం గ్రామానికి చెందిన రావాడ కుసుమ లాంగ్ జంప్‌లో జాతీయ స్థాయి గోల్డ్ మెడల్ సాధించడంతో మంగళవారం ఆమెను సత్కరించారు. నౌడూరు జంక్షన్‌లోని నేషనల్ ఫ్లాగ్ టవర్ వద్ద కుసుమను సన్మానించి రూ. 10 నగదు ప్రోత్సాహకం అందించారు. నేషనల్ టవర్ ఫ్లాగ్ నిర్మాత వడ్డి సుబ్బారావు అధ్యక్షతన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుసుమకు అందరూ సహకరించాలని కోరారు. పాల శ్రీనివాస్, వలవల శేషు, కుప్పిచెట్టు పార్వతి, వడ్డి సూర్యకుమారి, బండి ఆంజనేయులు, మహిళలు పాల్గొన్నారు.



దగ్ధమైన కొబ్బరి దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లులో కొబ్బరి దుకాణం దగ్ధం

పాలకొల్లు టౌన్, మే 14: పట్టణంలోని బద్దవానిపేటలో మంగళవారం షార్టు సర్క్యూట్‌తో కొబ్బరికాయల దుకాణం దగ్ధమైంది. దుకాణ యజమాని సిర్రా భాస్కరరావు సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే కొబ్బరికాయలు పూర్తిగా కాలిపోయాయి. ఆస్తి నష్టం రూ.5లక్షలు ఉంటుందని ఫైర్‌స్టేషన ఆఫీసర్ వైవి జానకిరామ్ తెలిపారు. దగ్ధమైన కొబ్బరికాయల దుకాణాన్ని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పరిశీలించారు. యజమానిని వివరాలు అడిగి సాయం అందేలా చూస్తానన్నారు



మన నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుస్తుందంటావ్.. ఫ్యాన్ పార్టీకి ఎదురుగాలి తప్పేట్టు లేదు. ఫ్యాన్ పార్టీ గెలుస్తుందని పందేనికి ఒక్కడూ రావడం లేదు మామ. అసలు కోసు పందేలన్నా ముందుకు రావడం లేదు. పోని రాష్ట్రంలో సీఎం సీటుపైనా పందెం ఉందేమో చూడు.. సీట్లు అయినా ఓకే. లేదు మామ నిన్నటి వరకూ వైసీపీ 70 సీట్లని రావులపాలెం రెడ్లు తిరిగారు. ఇప్పుడు వాళ్లు కూడా ఫోన్ ఎత్తడం లేదు. సరేలే ఏదొకటి గ్రామాల్లో మెజార్టీ అయినా చూడరా. ఇది గ్రామాల్లో ఏ మూలన చూసినా ఇదే చర్చ.

తాడేపల్లిగూడెం రూరల్, ఆచంట, లింగపాలెం

పందెం అంటే.. పరార్

• ఎన్నికల ఫలితాల్లో కూటమి వైపే పందేలు • జంకుతున్న అధికార పార్టీ

పోలింగ్ ముగియడంతో ప్రధాన పార్టీల విజయావకాశాలపై పందేలకు పలువురు ఎగబడుతున్నారు. ప్రధానంగా కూటమి విజయంపై పందేలకు మొగ్గు చూపుతున్నారు. అధికార పార్టీ తరపు నుంచి పందేలకు పెద్దగా ముందుకు రావడం లేదని పందెంరాయుళ్లు నిరాశ చెందుతున్నారు.

ఆ పార్టీ వాళ్లు కనిపిస్తే ఒట్టు!

పందెం రాయుళ్ల పందేల కోసం ఫోన్ చేయని మనిషి లేదు. అడగని నాయకుడు లేదు. ఎవరినైనా కదిలిస్తే కనీసం పౌరుషానికైనా పందేనికి దిగుతారని భావించి తెలిసిన ఫ్యాన్ పార్టీ వాళ్లను కదిలించి మరీ పందేలకు కాలుదువ్వుతుంటే కనీసం బెసకడం లేదనేది కూటమి నాయకుల బాధ.

ఫ్యాన్ పార్టీకి మన గ్రామంలో అయినా మెజార్టీ వస్తే బాగుంటుందని లేదంటే మనకు తల కొట్టేసినట్టుంటుందని ఆ పార్టీ నాయకుల మనోవేదనకు గురవుతున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఓ గ్రామంలో బూత్ బాధ్యతలు తీసుకున్న వ్యక్తి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో పది మంది కూటమి నాయకులు భారీ మొత్తంతో పందేనికి సై అన్నారు. దీంతో అవతలి వ్యక్తి తప్పనిసరి పరిస్థితిలో పందేనికి దిగారు. ఈ తరహా మరే పదేలకు వెళ్లకుండా అధికార పార్టీ వారు పలాయనం చిత్తగిస్తున్నారు.

లింగపాలెం మండలంలో కూడా కొందరు పందేలకు సిద్ధపడితే అధికార పార్టీ వైపు నుంచి ఎవరూ ముందుకు రావడం లేదు. గతం కంటే పోలింగ్ పెరగడం, గంటల తరబడి క్యూలో నిలబడి ఓటేయడంపై అధికార పార్టీ విజయావకాశాలపై నమ్మకం సన్నగిల్లుతోంది.

ఆచంటలో పందేల జోరు

ఆచంట నియోజకవర్గంలో పందేల జోరు ఆసక్తికరంగా ఉంది. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది. జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి. ఆచంట ఫలితం ఎలా ఉంటుందనే చర్చలతో పాటు బెట్టింగ్‌కు సిద్ధపడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వస్తుందని, కూటమి సీట్లు, వైసీపీ సీట్లపై సంఖ్యపై జోరుగా బెట్టింగ్‌లు జరిగినట్లు సమాచారం. ఎక్కువ శాతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వస్తుందనే బెట్టింగ్‌లు కాయడం గమనార్హం. ఆచంటలో రాష్ట్రంలో రాబోతున్న ప్రభుత్వంపై లక్షల్లో పందేలు వేసినట్లు సమాచారం. ఆచంట నియోజకవర్గ ఫలితంపై కూడా గ్రామాల వారీగా పోలింగ్ సరళిని లెక్కలు వేస్తున్నారు. ఆచంట ఫలితంపై కూడా కోట్ల రూపాయల పందేలకు సమాయత్తమవుతున్నారు.

పెరిగిన ఓటు రేటు!

ముదినేపల్లి: ఓటు రేటు బాగా పెరిగింది. గత 50 ఏళ్లలో ఓటు ధర ఎన్నో రెట్లు పెరిగింది. 1972 సార్వత్రిక ఎన్నికల్లో కొన్ని చోట్ల రాజకీయ పార్టీలు ఓటు కొనుగోలు చేసినట్లు కొందరు చెబుతున్నారు. అప్పట్లో అభ్యర్థులు ఓటుకు రూ.5 ఇచ్చినట్లు గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఓటు కనీస ధర రూ.వెయ్యి కాగా సాధారణ ఎన్నికల్లో గరిష్ఠంగా రూ.5 వేలు కూడా ఉన్నట్లు సమాచారం. అభ్యర్థుల ఆర్థిక పరిస్థితిని బట్టి ఒక్కో నియోజకవర్గంలో ఓటు రేటు ఒక్కోక్క రకంగా ఉంది. రెండు దశాబ్దాలుగా ధనవంతులు రాజకీయ రంగ ప్రవేశంతో ఓట్ల కొనుగోలు సర్వసాధారణమైంది. విచ్చలవిడిగా ఓట్ల కొనుగోలుతో ఓటు ధర కూడా బాగా పెరిగింది. 2014 సాధారణ ఎన్నికల్లో ఓటుకు రూ.500 చొప్పున పంపిణీ చేయగా 2019లో రూ. వెయ్యి కనీస ధర అయింది. ప్రస్తుత ఎన్నికల్లో అది కాస్తా రూ.5 వేలకు పెరిగింది. ఓటరుతో సంబంధం లేకుండా ఓటు కొనుగోలు చేసే నాయకులే రేటు పెంచడం గమనార్హం. నాయకులు కొనుగోలు చేసినా ఓటరు ఓటు అమ్ముకున్నాడా? నచ్చిన వారికే ఓటు వేశాడా అనేది ప్రశ్నార్థకం. భవిష్యత్‌లో ఓటు రేటు ఏ స్థాయికి చేరుతుందోనని రేటు నిర్ణయించే నాయకులే ఆందోళన చెందుతున్నారు.

పచ్చడి ఘాటు

» మామిడి ధరకు రెక్కలు

» మండుతున్న కారం » కాగుతున్న నూనె



పాలకొల్లు రూరల్/గణపవరం, మే 14: పచ్చళ్ల సీజన్‌కు ఎన్నికలు అడ్డుపడ్డాయి. పోలింగ్ ముగియడంతో ఆవకాయ పచ్చడిపై మహిళలు దృష్టి సారించారు. వేసవిలో ఆవకాయ, మాగాయ వంటి పచ్చళ్లు పెట్టుకోవడం సర్వసాధారణం. మామిడి నుంచి కారం, నూనె వరకు ధరలు పెరగడంతో పచ్చటి ఘాటెక్కింది. పేద మధ్య తరగతి వారికి పచ్చడి చేదుగా మారింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ప్రధాన పట్టణాలు, మండలాల్లో మామిడి కాయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

హడలెత్తిస్తున్న ధర

ఈ ఏడాది మామిడి ధర వింటేనే హడలెత్తిపోతున్నారు. ఆవకాయ పచ్చడికి పేరొందిన కొత్తపల్లి కొబ్బరి 100 కాయలు రూ.3500 ధర పలుకుతున్నాయి. చిన్న రసాలు రూ.2వేల వరకు, పెద్ద రసాలు రూ.1500 - రూ.1800, సువర్ణరేఖ రూ.1500, దేశవాళి రకం రూ.1400 చొప్పున విక్రయాలు జరిగాయి. స్తోమతను బట్టి మామిడి కాయలు కొనుగోలు చేసుకుంటున్నారు. మామిడి దిగుబడి తగ్గడం, వర్షాలు, వడగళ్లు మామిడిని దెబ్బతీశాయి. తుని, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, జికొత్తపల్లి, కంసాలిగుంట, తదితర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నాయి.

100 కాయల పచ్చడి రూ.10 వేలు

గత కొన్ని రోజులుగా మార్కెట్‌లో పలు రకాల పచ్చడి మామిడి కాయలు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ధరలు పెరగడంతో వంద కాయల పచ్చడి పెట్టుకునే వారు 50 కాయలతో సరిపెట్టుకుంటున్నారు. వంద కాయలతో ఆవకాయ పచ్చడికి సుమారు రూ 10వేలు ఖర్చవుతున్నదని మహిళలు చెబుతున్నారు. కాయను ముక్కలుగా చేయడాని కాయకు రూ3, గానుగ నూనె (నువ్వుల నూనె) లీటరు రూ 600, వేరుశనగ రూ. 180, పచ్చడి కారం కిలో రూ800, వెల్లుల్లి పావుకిలో రూ80, ఆవాలు కిలో రూ140, మెంతులు కిలో రూ.130 అమ్ముతున్నారు.

సీజన్ కూలీలకు ఉపాధి



పచ్చడి మామిడి కాయలు కొనుగోలు చేసినవారు ముక్కలు కొయ్యలేక మార్కెట్‌లోనే ముక్కలు కొట్టిస్తారు. ముక్కలు కొట్టడంలో కాయ దెబ్బతింటే పచ్చడి కూడా పాడవుతుంది. సీజన్‌లో జిల్లాలోని వారపు సంతలకు మామిడి ముక్కలు నరికే మహిళలు కుటుంబాలతో తరలివస్తారు. మామిడి ముక్కలు నరకడమే వారి జీవనోపాధి. పెనుగొండ, పాలకొల్లు, గణపవరం, మాముడూరు, తదితర ప్రాంతాల నుంచి 20 కుటుంబాల వారు మహిళల తో సహా వచ్చి పచ్చడి మామిడిముక్కలు నరుకుతుంటారు. ముక్కలు నరికి నందుకు కాయకు రూ.3 చొప్పున వంద కాయలకు రూ.300 తీసుకుంటారు. గత ఏడాది కాయకు రూ.2చొప్పున వసూలు చేయగా ఈ ఏడాది కాయకు రూ3చొప్పున వసూలు చేసుకున్నారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లో ప్రధాన మార్కెట్లలో మామిడి ముక్కలు కొట్టేవారికి గిరాకీ ఉంది. వేసవి నెలరోజులు ఈ కుటుంబాలకు జీవనోపాధిని ముక్కలు నరికే శ్రామికులు తెలిపారు.

16 నుంచి గుంటూరు ఎక్స్‌ప్రెస్ తాత్కాలికంగా రద్దు

నరసాపురం, మే 14: నరసాపురం నుంచి గుంటూరు ఫాస్ట్ ప్యాసింజర్ రైలును గురువారం నుంచి ఈనెలాఖరు వరకు రద్దు చేశారు. గుంటూరు డివిజన్‌లో ట్రాక్ పనులు చేపడుతున్నందున్న ఈ నిర్ణయం తీసుకున్నారు. 17282 నెంబర్‌తో ఉదయం 6 గంటలకు ఈ రైలు భీమవరం, ఆకివీడు, కైకలూరు మీదుగా విజయవాడ వెళుతుంది. తిరిగి 07181 నెంబర్‌తో బయలుదేరుతుంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ రైలు షెడ్యూల్ సమయాలు వ్యాపారులు, ఉద్యోగులకు అనుకూలంగా ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. గతంలో ఈ రైలును నాలుగు నెలల పాటు రద్దు చేశారు. ఆ సమయంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ సమయంలో ఎంపీ రఘురామకృష్ణంరాజు రైల్వే మంత్రితో మట్లాడి ఈ రైలును పునరుద్ధరించారు. ప్రస్తుతం 15 రోజుల పాటు రద్దు ప్రకటన వెలువడింది. గతంలో మాదిరిగా దీన్ని పొడిగిస్తే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఆ సమయంలో విజయవాడకు మరో రైలు లేదు.

ఉమ్మడి జిల్లాలో ప్రవీణ్ ప్రకాష్ పర్యటన వాయిదా

ఏలూరు ఎడ్యుకేషన్, మే 14 : పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పర్యటన వాయిదా పడింది. ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల సందర్శన, మండలాల్లోని విద్యాకానుక స్టాక్‌పాయింట్ల పరిశీలనకు బుధవారం ఆయన రావాల్సి ఉంది. పోలింగ్ విధుల్లో ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, ఎంఈవోలు అవిశ్రాంతంగా ఉండడంతో ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటన ఈ నెల 18కి వాయిదా పడింది. ఆ రోజున ఉదయం 9గంటలకు ప్రవీణ్ ప్రకాష్ జిల్లాకు రానున్నారని విద్యాశాఖ నుంచి స్థానిక విద్యాధికారులకు వర్తమానం అందింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, బైజూస్ కంటెంట్‌తో ఐఎఫ్‌పిలు పనితీరు, ట్యాబ్‌ల వర్కింగ్ కండీషన్, నోట్స్, వర్క్ బుక్‌ల కరెక్షన్, విద్యార్థుల ఇళ్ల సందర్శన, నాడు-నేడు/విద్యాకానుక, పాఠశాలల ప్రాంగణాల పరిశుభ్రత, ఫ్యూచర్‌స్కిల్ ఎక్స్‌పర్ట్, టోఫెల్ కార్యకలాపాలు తదితర అంశాలపై పీఎస్ నేరుగా పరిశీలించనున్నారు.



పోలవరంలో జోరుగా కురుస్తున్న వర్షం

పోలవరంలో భారీ వర్షం

పోలవరం, మే 14: మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ చిర్రెత్తించిన ఎండ వాతావరణం అకస్మాత్తుగా మారిపోయింది. చల్లని గాలులతో ఉక్కబోత నుంచి ఉపశమనం పొందారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. బెస్తావీధి, బాపూజీ కాలనీ, కమ్మరగూడెం, కృష్ణారావుపేట, నూతనగూడెం, ప్రాంతాలలో డ్రైనేజీలు పొంగి రోడ్లు వీధులు జలమయమయ్యాయి. మెయిన్ బజార్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు నిలిచి ప్రజా నీకం, స్థానిక వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఈదురు గాలులకు పోలవరం నుంచి కన్నాపురం మార్గంలో పలుచోట్ల చెట్ల కొమ్మలు రోడ్డుపై విరిగిపడ్డాయి. వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలిగింది. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరంలో రోడ్లపై ఆరబెట్టిన వరి, మొక్కజొన్న కాపాడుకోడానికి రైతులు అవస్థలు పడ్డారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం : మండలంలో మంగళవారం సాయంత్రం వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో సేదతీరారు. పట్టణంలోని డ్రైన్లు పొంగిపొర్లాయి. మురుగు రోడ్లపై రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పెదపాడు: ఉదయం నుంచి ఎండ వేడితో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం సాయంత్రానికి కాస్త చల్లబడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. దీంతో ముందు జాగ్రత్త చర్యగా విద్యుత్‌ను నిలిపివేశారు.

పాముకు దహన సంస్కారం

మొగల్తూరు, మే 14: మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామంలో నివాసాల మధ్య మృతి చెందిన నాగపాముకు గ్రామస్థులు మంగళవారం దహన సంస్కారం నిర్వహించారు. గ్రామంలోని మేళం వారి మెరకలో నివాసాల మధ్య తాచుపాము చనిపోయి ఉంది. గమనించిన స్థానికులు దాన్ని దైవ సమానమైన నాగపాముగా భావించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులంతా పామును పాడెపై ఊరేగించి దహన సంస్కారాలు చేశారు.



నాగపాముకు దహన సంస్కారాలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ

అక్కిరెడ్డిగూడెం వద్ద ప్రమాదం.. మేనమామ, మేనల్లుడు దుర్మరణం





చికిత్స పొందుతూ మృతి చెందిన గుజ్జుల రంగారావు లారీ చక్రాల కింద గొర్రెల ప్రకాష్ మృతదేహం

దెందులూరు, మే 14: మేనమామను మేనల్లుడు మోటార్ సైకిల్‌పై తీసుకువెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అక్కిరెడ్డిగూడెం వద్ద మంగళవారం మోటార్‌సైకిల్‌ను లారీ ఢీ కొంది. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేగివాడ గ్రామానికి చెందిన గుజ్జుల రంగారావు ఏలూరులో తన మేనల్లుడు గొర్రెల ప్రకాష్ ఇంటికి వెళ్లాడు. తిరిగి మేనమామ రంగారావును వేగివాడలో దింపేందుకు మంగళవారం ఉదయం మోటార్ సైకిల్‌పై ప్రకాష్ బయలుదేరాడు. అక్కిరెడ్డిగూడెం సమీపంలో లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గొర్రెల ప్రకాష్ లారీ కిందపడి అక్కడిక్కడే పడి మృతి చెందాడు. తీవ్ర గాయాలైన రంగారావును ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్స్ అందుబాటులో లేదు. స్థానిక టీడీపీ నేతలు ఆటోలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. రంగారావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

కుక్కునూరు, మే 14: ఉపాధిహామీ కూలీలపై తేనెటీగల దాడి చేసిన నేపథ్యంలో పలువురు గాయపడ్డారు. మండల పరిధిలోని దామరచర్లలో మంగళవారం ఉపాధి కూలీలు చెరువు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో తేనెటీగలు ఒక్కసారిగా చెదిరి ఉపాధి కూలీలపై దాడి చేశాయి. ఈ దాడిలో 20మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం వారిని అమరవరం పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు వారికి వెంటనే వారికి వైద్యం అందించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఉపాధి కూలీలు తరచు తేనెటీగల బారిన పడుతున్నారు.

నేడు తలసేమియా వ్యాధిపై అవగాహన సదస్సు

ఏలూరు క్రైం, మే 14 : తలసేమియా వ్యాధిగ్రస్తులకు బుధవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ, విజయవాడలోని రెయిన్‌బో చిల్డ్రన్ ఆసుపత్రి సహకారంతో ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకూ అవగాహన కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణురాలు, కన్సల్టెంట్ పిడియాట్రిక్ హెమటో అంకాలజిస్టు డాక్టర్ వీణ అక్కినేని పాల్గొంటారన్నారు. తలసేమియా స్క్రీనింగ్, హెచ్‌పీఎల్‌సీ వంటి రక్తపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వ్యాధి వచ్చిన తరువాత బాధపడడం కంటే ముందస్తు పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు పడడం ఎంతో ముఖ్యమని ఛైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపాడు, మే 14 : పెదపాడు సెక్షన్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో వున్న 11 కేవీ రాళ్లపల్లివారిపాలెం ఫీడర్ న్యూలైన్ల మరమ్మతుల నిమిత్తం ఈ నెల 16, 17, 18వ తేదీల్లో ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ వై.రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఖాజీగూడెం, గుడిపాడు, సత్యవోలు, రాళ్ళపల్లివారిపాలెం, పెదపాడు ఫీడర్ పరిధిలో గల నాయుడుగూడెం పరిసర ప్రాంతాలకు విద్యుత్‌కు ఆటంకం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ రాంబాబు కోరారు.

రేపటి నుంచి దోమల మందు పిచికారీ

పోలవరం, మే 14 : మండలంలో తొలి విడత దోమల మందు మలాథియాన్ పిచికారీ పనులు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి బొంగు నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మలేరియా అధికారి సురేష్ ఆదేశాల మేరకు పోలవరం మండలంలో వింజరం, ఎల్లండీపేట, ఆరోగ్య కేంద్రాల పరిధిలో 37 సమస్యాత్మక గ్రామాలలో దోమల మందు పిచికారీ నిర్వహించనున్నట్లు, తొలుత ఎల్లండీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మనుగోపల, కుంకాల గ్రామాలలో స్ప్రేయింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో , నివాసాల్లో దోమల మందు పిచికారీకి ప్రజలు సహకరించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల ద్వారా వచ్చే అనారోగ్యాల నివారణకు తోడ్పడాలని కోరారు.

18న వాసవీ మాత జయంతి

చింతలపూడి, మే 14: ఈ నెల 18న ఆర్య వైశ్యుల కులదేవత వాసవీ మాత జయంతి సందర్భంగా పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో చింతలపూడిలో ఉత్సవంలా కార్యక్రమం చేపడుతున్నట్లు సంఘ అధ్యక్షులు వజ్రపు శేఖర్ తెలిపారు. మొత్తం 126 మంది ఆర్యవైశ్య మహిళలు ఒకేరకమైన చీరలు ధరించి తలపై కలశాలతో సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రధాన రోడ్లలో అమ్మవారి విగ్రహంతో ఊరేగింపు నిర్వహిస్తాన్నారు. రత్నా షాపింగ్ మాల్ గ్రౌండ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహ శిబిరంలో పూజలు, అభిషేకాలు, అర్చనలు చేస్తారన్నారు. నియోజకవర్గంలోని వారే కాకుండా, చాట్రాయి, తెలంగాణలోని దమ్మపేట, అశ్వారావుపేట, సత్తుపల్లి ఏరియాలోని ఆర్యవైశ్యులు కూడా ఈ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

టెన్త్, ఇంటర్ టాపర్లకు సత్కారం



ఏలూరు రూరల్, మే 14: సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్లో పదో తరగతి సీబీఎస్ఈ, ఇంటర్మీడియట్‌సెకండియర్ ఫలితాలు వచ్చిన సందర్భంగా అన్ని సబ్జెక్టుల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు మంగళవారం సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఆర్ రెడ్డి సంస్థల కార్యదర్శి డాక్టర్ ఎండీఎస్‌వీ ప్రసాద్, జాయింట్ సెక్రటరి శ్రీకృష్ణ, కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇంటర్మీడియట్ సెకండియర్‌లో ఎం.రాజాసుందర్, టెన్త్‌లో ఎస్.వెంకట సాహితి టాపర్స్‌గా నిలిచారు.

ఎన్నికల విధులు నిర్వహించిన వారికి అభినందనలు

ఏలూరు ఎడ్యుకేషన్, మే 14: ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులందరికీ అభినందనలు తెలియజేస్తున్నట్టు జేఏసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలో 83 శాతానికి పైగా పోలింగ్ నమోదు అయిందంటే దానికి సహనం, ఓర్పుతో విధులు నిర్వహించిన ప్రతి ఉద్యోగికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని వారు పేర్కొన్నారు. ఎక్కడ ఏదో ఇబ్బంది కలిగినా స్పందించి ఉద్యోగుల పక్షాన నిలబడి, చిన్న సమస్య వచ్చినా వెంటనే సమస్యకు పరిష్కారం చూపిన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఓటర్లను స్వీప్ కార్యక్రమం ద్వారా చైతన్యపరిచి అత్యధికంగా పోలింగ్ జరిగేలా చేసిన జిల్లా అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తలందరికీ ధన్యవాదాలు

కుక్కునూరు, మే 14: ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కుక్కునూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలంతా విజయం కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కోటగిరి సత్యనారాయణ, కే.అప్పలరాజు, పిచ్చుకరాజు, తదితరులు పాల్గొన్నారు.


గెలుపోటముల పై చర్చలు

కొయ్యలగూడెం, మే 14: పోలవరం నియోజకవర్గంలో గెలుపు ఓటముల పై ఇరు పార్టీల్లోనూ చర్చలు కొనసాగిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ నాయకులు తమ గ్రామాల్లో ఇంత ఓటింగ్ మాకు పడిందంటూ మాకే ఎక్కువ పడిందని చర్చించుకుంటున్నారు. అయితే పోలింగ్ శాతం ఎక్కువగా నమోదు కావడం సాయంత్రం వరకు పోలింగ్ జరగటంతో కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ బాగా పని చేసిందంటూ కూటమి నాయకులు అంటున్నారు. తక్కువ ఓట్లతోనైనా గెలుస్తామని ఇరు పార్టీల వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అన్న సమారాధన

పెదపాడు, మే 14 : పెదపాడు మండలం అప్పనవీడులోని ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి వారి దేవాలయం వద్ద దాతల సహకారంతో 200 మందికి అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్లుగా ఆలయ ఇవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం కావడంతో స్వామివారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి



బుట్టాయగూడెం, మే 14: వేసవి సెలవుల్లో యువత క్రీడలపై దృష్టిని సారించాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. దుద్దుకూరులో మంగళవారం రాచూరు యూత్‌కి వాలీబాల్ కిట్‌ను అందజేశారు. చదువులో రాణించినట్లే క్రీడల్లోను రాణిం చాలని సూచించారు. కార్యక్రమం లో నాయకులు మడకం సురేష్, ఎంపీటీసీ మొడియం వెంకాయమ్మ, కొమరం చల్లయ్య, మంగారావు, మొడియం వెంకటేష్, కుర్సం రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులు సహకరించలేదు



ఏలూరు రూరల్, మే 14: ఈ సార్వత్రిక ఎన్నికలలో ఇండియా కూటమి ఏలూరు ఎంపీ అభ్యర్థిగా గట్టి పోటీ ఇచ్చానని కావూరి లావణ్య మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. అయితే ఇండియా కూటమి అసెంబ్లీ అభ్యర్థులు తనకు ఎటువంటి సహకారం అందించలేదని, అడుగడుగునా అవమానాలకు గురి చేశారని లావణ్య వాపోయారు. పీసీసీ ఎన్ఆర్ఐ అయిన తనకు ఇండియా కూటమి ఎంపీ సీటు కేటాయించి గౌరవించిందన్నారు. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు చేపట్టి కాంగ్రెస్ పార్టీకి ఊపిరి పోశారన్నారు. అయితే ఎంపీ నియోజకవర్గంలో పలువురు ఇండియా కూటమి అసెంబ్లీ అభ్యర్థులు తనకు కనీస గౌరవం ఇవ్వలేదని, అడుగడుగునా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశాడని, ఏలూరు అసెంబ్లీ స్థానం తనకు కేటాయించలేదని కనుక తనకు నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారని ఆరోపించారు. ఇదే సమయంలో కొందరు అభ్యర్థుల తరఫున అతనే వకాల్తా పుచుకుని నియోజకవర్గాల్లో క్యాడర్ పని చేయకుండా చూశాడని మండిపడ్డారు. కొందరు మినహా మిగతా అభ్యర్థులంతా తనకు ఎటువంటి సహకారం అందించలేదని, టీడీపీ, వైసీపీ పార్టీలతో కుమ్మకయ్యారని ధ్వజమెత్తారు. ు.

మండల స్థాయిలో భారీ పోలింగ్

సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. మండల స్థాయి నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు భారీ ఓటింగ్ నమోదైంది. ప్రజలు మార్పు కోరుకుంటున్నారనడానికి నిదర్శనమని పలువురు భావిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న వారు సైతం తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఖర్చును లెక్క చేయకుండా తరలి వచ్చారు.

- గంటల తరబడి క్యూ లైన్‌లో ఓటర్లు
- రాత్రి 10.30 వరకు జరిగిన ఓటింగ్



టి.నరసాపురం, మే 14 : మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 88.52 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 46,094 మంది ఓటర్లు ఉండగా 40,803 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 20,304 మంది పురుషులు 20,499 మంది మహిళలు ఉన్నారు. 15 గ్రామాల్లో 46 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

వేలేరుపాడులో 90.75 శాతం

మండలంలో రికార్డు స్థాయిలో 90.75 శాతం ఓటింగ్ నమోదైంది. 22 పోలింగ్ బూత్‌లలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తి మరీ ఓటింగ్‌లో పాల్గొన్నారు. మొత్తం 17,596 ఓట్లకు గానూ 15,969 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఇంత భారీగా ఓట్లు పోలవ్వడంతో ఎన్‌డీఏ కూటమిలో ఆశలు రేకెత్తిస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో రాత్రి 11 గంటల వరకు పోలింగ్ జరగడంతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లన్ని తమకే పోలయ్యాయాని ఎన్‌డీఏ కూటమి ఆశాభావం వ్యక్తం చేస్తూ తమదే విజయమంటూ ఇప్పటి నుంచే సంబరాలు చేసుకుంటున్నారు.

చింతలపూడిలో 81.52 శాతం పోలింగ్

చింతలపూడి ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో 81.52 శాతం పోలింగ్ జరిగింది. మొత్తం ఓటర్లు 2,73,069 కాగా 2,22,608 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 1,10,679 మహిళలు 1,11,908 మంది ఓట్లు వేశారు. ట్రాన్స్ జెండర్ కూడా 21 మంది ఓటు వేశారు. పురుషుల కంటే మహిళలు 4,430 మంది ఓటు వేశారు. పురుషుల ఓటింగ్ 82.41 శాతంగా, మహిళలది 80.66 శాతం నమోదు అయింది. నియోజకవర్గంలో అత్యధికంగా తిమ్మిరెడ్డిపల్లిలో 96.83 శాతం పోల్ అయింది. ఈ క్రమంలో మొత్తం ఓటర్లు 945 కాగా, 915 మంది ఓట్లు వేశారు. అత్యల్పంగా 152వ బూత్‌లో 1,305 ఓట్లకు 717 మంది ఓటు వినియోగించుకున్నారు. 54.94 శాతమే పోలయ్యింది.

కుక్కునూరు మండలంలో 87.16 శాతం

మండలంలో 87.16 శాతం ఎన్నికల పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. తొమ్మిది పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 10.30 వరకు పోలింగ్ జరిగిందన్నారు. వేలేరు, అల్లిగూడెం, వింజరం, కుక్కునూరు, రామసింగారం, వెంకటాపురం, ఇబ్రహీంపేట, తదితర గ్రామాల్లో పోలింగ్ ఆలస్యంగా ముగిసింది. లచ్చిగూడెం పోలింగ్ బూత్‌లో అత్యధికంగా 96 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలింగ్ శాతం నమోదకావడం విశేషం. హైదరాబాద్, బెంగుళూరు నుంచి కూడా యువత వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బెంగుళూరుకు చెందిన ఒక యువతి దాదాపు రూ.20 వేలు ఖర్చు చేసి మూడు గంటల పాటు ఓటింగ్ క్యూలో నుంచుని తన ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తెలిపారు.

టి.నరసాపురం మండలంలో 88.52 శాతం

మండలంలో 88.52 శాతంగా పోలింగ్ నమోదైంది. మొత్తం 46,094కి 40,803 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 20,304, మహిళలు 20,499 ఓటేశారు. 15 గ్రామాల్లో 46 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

కొయ్యలగూడెం మండలంలో 85.85 శాతం

మండలంలో 85.85 శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 59,843 మంది ఓటర్లకు 51,376 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 25,493, మహిళలు 25,883 మంది ఉన్నారు. కాగా, రాత్రి ఏడు గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

లింగపాలెం మండలంలో 89.42 శాతం

మండలంలో 89.42 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగియటంతో ప్రజలు ఆయాపార్టీల గెలుపు పై పందేలు కడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో పలానా అభ్యర్థి గెలుస్తాడంటూ ముఖ్యమంత్రిగా తమ నాయకుడే ప్రమాణ స్వీకారం చేస్తాడంటూ పందేలు కడుతున్నారు. ఏ నలుగురు కలిసినా ఎన్నికల గురించి ఆయాపార్టీల గెలుపు, ఓటమిల గురించే చర్చించు కుంటున్నారు.

ఉంగుటూరులో 87.75శాతం ఓటింగ్

ఉంగుటూరు నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో 87.75 శాతం ఓటింగ్ నమోదైంది. గతంలో ఎన్నడు లేనివిధంగా ఈసారి పోలింగ్ శాతం ఎక్కువగా నమోదు కావడంతో అభ్యర్థులు జంకుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 2,06,437 ఓట్లు ఉండగా అందులో పోలైన ఓట్లు 1,81,156 ఇందులో పురుషులు 90,546, మహిళలు 90,605 ఉన్నారు. ఎవరికి వారే గెలుపుపై ధీమాతో ఉన్నారు. గ్రామాల నుంచి కార్యకర్తలను పిలిపించుకుని ఓటింగ్ సరళిపై చర్చిస్తున్నారు.

పల్లెల్లో పోటెత్తిన ఓటరు



చింతలపూడి, మే 14: చింతలపూడి ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో పల్లె ఓటరు పోటెత్తారు. ఓటర్లు ఎండలో నిలబడి, నిలబడలేని వారు తిరిగి పోలింగ్ కేంద్రానికి వచ్చి రాత్రి ఎంత పొద్దు పోయినా ఓటువేసి వెళ్లటం విశేషం. కొన్ని కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయిం చటంతో ఓటింగ్ ఆలస్యమైంది. నియోజకవర్గంలో జంగారెడ్డిగూడెం, చింతలపూడి, కామవరపుకోట, లింగపాలెం మండలాల్లో మొత్తం 2,73,069 మంది ఓటర్లు ఉండగా, పోలింగ్ బూత్‌ల వద్ద ఉదయం ఆరు గంటల నుంచే క్యూలో నిలబడ్డారు. ముందుగా ఓటు వేసేస్తే తమ పనులు చూసుకోవచ్చని భావించి ఉదయమే బారులుతీరారు. కొందరు నిలబడలేక సాయంత్రం వచ్చి ఓటు వేశారు. ఓటు వేయడానికి దేశ, విదేశాల నుంచి కూడా కుటుంబాలతో పలువురు తరలివచ్చారు. గతంలో ఇటువంటి రాకను ఈ ప్రాంతంలో చూడలేదని స్థానికులు చెప్పుకుం టున్నారు. దూరపు ప్రాంతాల నుంచి వచ్చిన ఈ కుటుంబాల్లో పండుగ వాతావ రణం కనిపించింది. దూర ప్రాంతం నుంచి వచ్చాం కదా అంతపొద్దు పోయినా ఓటు వేసి వెళ్లాలని నిర్ణయించుకున్నామని పలువురు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసమే ఒకరికొకరం అందరం అనుకుని తరలివచ్చామని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు చెప్పుకొచ్చారు. ఈ ప్రాంతంలో వేలసంఖ్యలోనే దూరప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విడిపోయాక పదేళ్లలో కూడా అభివృద్ధి లేదని, రాజకీయాల కోసం రాష్ట్రం నాశనం కాకూడదని వచ్చి ఓటు వేశామని చెప్పుకొచ్చారు. ఎన్ఆర్ఐ బొల్లినేని సాయి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి కావాలంటే ఓటును సద్వినియోగం చేయాలని, అది ఎవరైనా సరే రాష్ట్రాభివృద్ధి కాపాడటానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పల్లెల్లో పోలింగ్ శాతం ఎక్కువగా ఉంది. నిర్వాహకులు కూడా ఓటర్ జాబితాలు చూసుకుని పోలింగ్‌కు రానివారిని ఆటోలో తీసుకువచ్చి ఓట్లు వేయించారు. వయస్సుమీరిన పెద్దలు కూడా ఓటు వేయటానికి ఎండలో నిరీక్షించారు. రాత్రి 8 గంటల ప్రాంతానికి నియోజకవర్గంలో సుమారు 70 పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయటానికి క్యూ లైన్‌లో ఉన్నారు. ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రతి బూత్‌లోనూ టెన్షన్‌తో గడిపారు. దేశవరంలో తమ ఊరికి రోడ్డులేదని మొరాయించి మేము ఓటింగ్‌కు రామంటూ గ్రామస్తులను కూడా వెళ్లనివ్వకుండా కంచె వేశారు. దీంతో తహసీల్దార్ గోపాలకృష్ణ విషయం తెలుసుకుని గ్రామానికి వెళ్లి రోడ్డు సమస్య పై అభయమిచ్చి అడ్డుగా వేసిన కంచెను ఆయనే తొలగించారు. 81.52 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం పోలింగ్ నెమ్మదిగా జరిగినా పొద్దుపోయే వరకు జరిగింది. సాయంత్రం భారీ ఎత్తున ఓటర్లు ఓటేసేందుకు తరలివచ్చారు.

అంతన్నారు ఇంతన్నారు..

పోలింగ్ రోజున పత్తా లేని స్వతంత్ర అభ్యర్థులు

వేలేరుపాడు, మే 14: అధికార ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులతో పాటు సమానంగా తమదే విజయం అన్నరీతిలో ప్రచారం నిర్వహించిన స్వతంత్ర అభ్యర్థులు పోలింగ్ మరో రెండు రోజులు ఉందనగా పత్తాలేకుండా పోయారు. పోలవరం అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో టీడీపీలోని అసమ్మతివర్గం తమకు అనుకూలంగా వ్యవహరిస్తుందని ఆశాభావంతో ఆ పార్టీ నుంచి సస్పెండ్ అయినా స్వతంత్ర అభ్యర్థి ప్రధాన పార్టీలతో పాటు సమానంగా ప్రచారం నిర్వహించారు. టీడీపీలోని అసమ్మతి వర్గాన్ని తమ వైపునకు తిప్పుకుని బహిరంగంగానే వారితో ప్రచారం చేశారు. ప్రతిపక్ష, అధికార పార్టీలు పోలవరం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిలేదని అలాగే పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయకపోగా తీవ్ర అన్యాయం చేశారని ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావిస్తూ స్వాతంత్ర్య అభ్యర్థిగా తనను గెలిపిస్తే పోలవరం నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా అసెంబ్లీలో పోరాటం చేస్తానంటూ పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు.

ఒక దశలో అధికార, ప్రతిపక్ష పార్టీల్లో కూడా తమ ఓట్లు ఎక్కడ చీలుతాయోనని కొంత ఆందోళన కూడా కలిగింది. ఎన్నికల్లో తమదే విజయమంటూ ప్రచారం చేసుకుని చివర్లో చేతులు ఎత్తేయ డంతో ఆ స్వాతంత్ర్య అభ్యర్థికి సహకరించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీలోని అసమ్మతి వర్గానికి మింగుడుపడటంలేదు. కనీసం పోలింగ్ ఏజెంట్లను కూడా నియమించకుండా స్వాతంత్ర్య అభ్యర్థి సైలెంట్ అయిపోవడం వెనుకా ఏదో బలమైన కారణం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఓటమి భయంతోనే దాడులు

ఏలూరు టూ టౌన్, మే 14 : వైసీపీ నాయకులు ఓటమి భయంతో కూటమి కార్యకర్తల పై దాడులకు తెగబడుతున్నారని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ధ్వజమెత్తారు. బడేటి క్యాంపు కార్యాలయంలో మంగళవారం చంటి మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా సోమవారం ఎన్నికలు జరుగుతున్న సమయంలో పోణంగికి చెందిన టీడీపీ కార్యకర్త వేమూరి నాగరాజు పై వైసీపీ గుండాలు దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఓటమి భయంతోనే ఇలాంటి దాడులకు తెగబడుతున్నారని అన్నారు. నాగరాజు మెడ పై కత్తితో దాడి చేయడం దుర్మార్గమన్నారు. ప్రశాంత వాతావరణంలో జరుగుతున్న పోలింగ్ సమయంలో ఇలాంటి సంఘటనలు కలకలం సృష్టిస్తున్నాయని అన్నారు. నాగరాజు కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. అన్ని విధాల ఆదుకుంటామని భరోసా కల్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజును పరామర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి ఘటనలు దురదృష్టకరమన్నారు. దాడులకు పాల్పడినవారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణతో ఇబ్బందులు

- ట్రాఫిక్ సమస్యతో ప్రజల పాట్లు
- పట్టించుకోని అధికారులు

ఏలూరు రూరల్, మే 14: నగరంలోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంతో రోజురోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ప్రజల కష్టాలను అధికారులు గాలికి వదిలేశారు. మున్సిపల్ అధికారులు అసలు ఈ విషయం పై దృష్టిపెట్టడం లేదు. కొంతమంది స్థానిక లీడర్లు, అంగబలం ఉన్నవారు ఫుట్‌పాత్‌లు, రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. ఇలాంటి వారిని కూడా చూసిచూడనట్లు అధికారులు వ్యవహరిస్తుండటంతో రోడ్లు, ఫుట్‌పాత్‌లు వీరి ఆక్రమణలోకి వెళుతున్నాయి. స్థానిక సీఆర్ రెడ్డి కళాశాల పక్కన ఫుట్‌పాత్ ఆక్రమణకు గురైంది. ఫుట్‌పాత్ పక్కన పలు వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో పండ్లు, పువ్వులు, ఇతరత్రా కొనుగోలు చేసేందుకు వాహనాలను రోడ్డుపక్కనే నిలిపివేయటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వాహనాలు పక్కనే పెట్టుకోండి అని చెబుతుంటే వ్యాపారస్తులు అడిగిన వారి పై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇటువంటి ఆక్రమణలను ఎందుకు అడ్డుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఫుట్‌పాత్ కొంచెం వదిలి మిగతాది అంతా ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా అధికారులు ఎవరూ దృష్టిపెట్టడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణం ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



సీఆర్ రెడ్డి కళాశాల వద్ద ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన పండ్ల దుకాణం

పోలింగ్ ప్రక్రియ దస్త్రాల పరిశీలన

భీమవరం టౌన్, మే 14 : పాల కొల్లు నియోజకవర్గం పోలింగు ప్రక్రియకు సంబంధించిన దస్త్రాలను సాధారణ పరిశీలకులు ఎం.దీప సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ పరిశీలించారు. మంగళవారం బీవీ రాజు ఫౌండేషను బి.సీతా పాలిటెక్నిక్ కాలేజీలో ఓటర్లు సంతకాలు చేసిన రిజిస్టర్లను పరిశీలించి, ఫొటో గుర్తింపు కార్డుపై ఎంత మంది ఓటు వేశారు, ఇతర ఐడి కార్డులు చూపించి ఎంతమంది ఓటు వేశారని ఆమె పరిశీలించారు.

పోలింగుకు సంబంధించిన పీవోలు, ఏపీవోలు లేఖలను ఆమె క్షుణ్ణం గా పరిశీలించారు. పాలకొల్లు నియోజక వర్గంలోని 40 పోలింగ్ స్టేషన్లకు సంబం ధించిన దస్త్రాలను పీవోలు, ఏపీవోలు లేఖలను పరిశీలించి, రిటర్నింగ్ అధికారిని కొన్ని వివరాలను సాధారణ పరిశీల కులు ఎం.దీప అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు నియోజకవర్గం ఆర్వో బి.శివనారాయణ రెడ్డి, లైజన్ ఆఫీసరు ఎ.వి.అప్పారావు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న పరిశీలకురాలు ఎం.దీప

ఫలించని వలంటీర్ల వ్యూహం

ఆకివీడు, మే 14 : వైసీపీ నమ్ముకున్న వలంటీర్ల వ్యూహం ఫలించలేదు. సార్వత్రిక ఎన్నికలల్లో వలంటీర్ల ప్రభావం మచ్చుకైనా కనిపించలేదు. ప్రభుత్వంలో పనిచేసిన వలంటీర్లు అంతా రాజీనామా చెయ్యాలని చివరి నిమిషం వరకు వైసీపీ నాయకులు, అభ్యర్థులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేశారు. రాజీనామా చేసినవారితో ఎన్నికల ప్రచారాలు నిర్వహించుకున్నారు. పెన్షన్‌లు, రేషన్, ఇంటింటికి పంపిణీ చేసే వలంటీర్లతో తమకు మేలు జరుగుతుందని వైసీపీ భావించింది. కేడర్‌ను విస్మరించింది. ఎన్నికల రోజు వలంటీర్ల ప్రభావం కనిపించకపోగా, క్యాడర్ కూడా దూరం అయింది. గ్రామాల్లో శిబిరాలు కానరాలేదు. వలంటీర్లు పోలింగ్ కేంద్రాల వద్ద తారసపడలేదు. దీనిపైనే అధికార పార్టీ అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో 9,200 మంది వలంటీర్లు పని చేశారు. ఇందులో వైసీపీ వత్తిడిని తట్టుకోలేక 4వేల 200 మంది రాజీనామా చేశారు. వైసీపీ అభ్యర్థులు తాయిలాలు ఇచ్చారు. ఒక్కొక్క వలంటీర్‌కు రూ.20వేల వంతున ముట్టజెప్పారు. వలంటీర్లు అంతా ప్రచారంలో పాల్గొన్నారు. సొమ్ములు పంపిణీలో ముందుఉన్నారు. వీరి ప్రభావం ఓటర్లపై మచ్చుకైన కనిపించలేదు.

గన్నిని కలిసిన ధర్మరాజు



భీమడోలు, మే 14 : ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులను కూటమి ఉంగుటూరు అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. జరిగిన ఎన్నికల సరళిపై చర్చించారు. అనంతరం జరిగిన సమావేశంలో గన్ని వీరాంజనేయులు, ధర్మరాజు మాట్లాడుతూ మార్పు మొదలైందనడానికి జరిగిన ఎన్నికలే నిదర్శనమన్నారు. ప్రజలంతా ఏకోన్ముఖులై జగన్‌ను గద్దె దింపేందుకు కంకణం కట్టుకుని జాతరలా ఓట్లు వేయడానికి వచ్చారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను ధర్మరాజు కృషి చేస్తామన్నారు. ఎన్నికల్లో విజయం సాధించనున్న ధర్మరాజుకు ముందుగా అభినందనలు తెలిపారు. ఉంగుటూరులో ధర్మరాజు, ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్ అత్యధిక మెజార్టీతో గెలుస్తారని గన్ని అన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపు పై ఎవరి ధీమా వారిదే

గణపవరం, మే 14: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు తమ అభ్యర్థుల గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏ నలుగురు కలిసిన ఎన్నికల ఫలితాల పై చర్చ జరుగుతోంది. పోటీ చేసిన అభ్యర్థులు సైతం కూడికలు, తీసివేతలతో అంచనాల్లో మునిగి తేలుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నుంచి పాతపాటి హరికుమార్‌రాజు పోటీ చేశారు. ప్రతి గ్రామం నుంచి ఆయా పార్టీల కార్యకర్తలను పిలిపించుకుని ఎన్ని ఓట్లు వచ్చాయని లెక్కలు వేసుకుంటున్నారు. అన్ని మండలాల్లో జనసేన, వైసీపీ మధ్య పోటీ నెలకొంది. నెల రోజుల నుంచి కార్యకర్తలతో జాతరలా కనిపించిన పార్టీ కార్యాలయాలు నేడు వెలవెలబోతున్నాయి.

ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం

చింతలపూడి, మే 14: ఏపీలోనూ, దేశంలోనూ ఎన్‌డీఏ ప్రభుత్వాల ఏర్పాటు ఖాయమని, వైసీపీ ప్రభుత్వం పై ఉన్న వ్యతిరేఖతను ఏపీ ఓటర్ పోలింగ్ రోజునే తన ఓటు ద్వారా చెప్పేశారని, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ మంగళవారం విలేకరుల సమావేశంలో చెప్పారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, దౌర్జన్యంపై విసిగిపోయిన ఓటర్లు అర్ధరాత్రి వరకు బారులుతీరి మరి వైసీపీని ఓడించేందుకు కసితో ఓట్లు వేశారన్నారు. చింతలపూడి, పోలవరం, అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. పేదలు, బడుగు, బలహీనవర్గాలు, యువతతో పాటు మధ్యతరగతి ప్రజలు అందరూ ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పోటెత్తారని తెలిపారు. ఈ ఎన్నికల కోసం నియోజకవర్గంలో కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. జూన్ నాలుగున సంబరాలకు సిద్ధం కావాలన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు, మే 14: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందులు షాపు ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం వయో వృద్ధులకు నిర్వహించే బీపీ, షుగర్ పరీక్షలను డాక్టర్ బి. రమేష్ చంద్రబాబు 28 మందికి ఉచితంగా అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కాయల నాగేశ్వరరావు, ద్వారంపూడి బాపిరెడ్డి, ఇవటూరి లక్ష్మణరావు, సీఎస్ సాధు తదితరులు పాల్గొన్నారు.

చదరంగం, వైకుంఠపాళీ పోటీలు

పాలకొల్లు అర్బన్, మే 14: వేసవి సెలవులు సందర్భంగా చిన్నారులలో నిబిడీకృతమైన నైపుణ్యాన్ని వెలికితీయడం, క్రీడా స్ఫూర్తిని కలిగించాలన్న ధ్యేయంలో చదరంగం, వైకుంఠ పాళీ ఆటల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పప్పుల దుర్గేష్ (నేత్రన్ దుర్గేష్) మంగళవారం తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు పోటీలను నిర్వహించి, బహుమతులు అందజేయనున్నామన్నారు. పోటీలను ఈనెల 26వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు పెద్ద గోపురం వద్ద ఉన్నరేపాక వారి సత్రంలో నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు తమపేర్లను నమోదు చేయించు కోవాలని, ఇతర వివరాలకు 92905 40512 సంప్రదించ వచ్చునని దుర్గేష్ తెలిపారు.



ముసునూరులో కేక్ కట్ చేస్తున్న సగర సంఘం నాయకులు



సంతోషపురంలో భగీరథుడి చిత్రపటాలతో బైక్ ర్యాలీ



ఆగిరిపల్లిలో జయంతి వేడుకలు

ఘనంగా భగీరథ జయంతి

ముసునూరు, మే 14: ముసునూరులో భగీరథ మహర్షి జయంతి వేడుకలను సగర సంఘం నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సగర కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం సమీపానగల భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేశారు. దివి నుంచి భువికి గంగమ్మను రప్పించేందుకు భగీరథ మహర్షి పట్టుదల, ఏకగ్రతతో చేసిన కఠోర దీక్ష, నేటి యువతకు ఆదర్శమని నాయకులు సూచించారు. సగరులంతా ఐక్యతగా ఉండి, సంఘం అభివృద్ధితోపాటు తమ హక్కులను సాధించుకోవడానికి పోరాడాలని కోరారు. అనంతరం మిఠాలు పంపిణీ చేశారు. సగర సంఘం పెద్దలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలో సంతోషపురం, అమరావతి గ్రామాల్లో మంగళవారం సగర క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు భగీరథుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం భగీరథుడి చిత్రపటాలతో ఊరేగింపుగా పురవీధుల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘం నాయకులు కాల్వ రాజేష్, జుత్తు అచ్చెన్న, పెరుమాళ్ల శ్రీనివాసరావు, జుత్తు రాంబాబు, దోణాద్రి దుర్గారావు, గండికోట నరసింహారావు, పోతు విజయకుమార్, కర్నాటి సత్యనారాయణ, నక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కొమ్మూరులో సగర సంఘం యూత్ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భగీరథుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా టీడీపీ సగర సంఘం సభ్యులు పోతు రామారావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షులు పోతు ఏడుకొండలు, పంచాయతీ బోర్డు సభ్యులు పోతు రాంబాబు, మాజీ సభ్యులు, కులపెద్దలు పోతు శ్రీనివాస్, పోతు వెంకటపతి, చెన్నుబోయిన పానకాలు తదితరులు పాల్గొన్నారు.

చిరు జల్లులతో సేదతీరిన ప్రజలు

నూజివీడు టౌన్, మే 14: రెండు రోజులుగా భానుడి ప్రతాపానికి అల్లాడిన ప్రజలు మంగళవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురవడంతో నూజివీడు ప్రాంత వాసులు సేదతీరారు. నూజివీడు పట్టణ, మండలంలో ఆకాశం మేఘావృతమై భారీ వర్షం పడే అవకాశం కనిపించింది. అయితే వరుణుడు చిరు జల్లులకే పరిమితమయ్యాడు. వాతావరణం మాత్రం చల్లబడటంతో పట్టణ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.



ముదినేపల్లిలో ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద కిక్కిరిసిన జనం

మద్యం కోసం బారులు తీరిన జనం

ముదినేపల్లి, మే 14 : ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద మద్యం ప్రియులు మంగళవారం బారులు తీరారు. ఎన్నికల సందర్భంగా ఈ నెల 11 నుంచి మద్యం దుకాణాలను మూసివేయటం, రాజకీయ పార్టీల నుంచి ఆశించినంత రీతిలో మద్యం అందకపోవటంతో మద్యం ప్రియులకు మందు మూడు రోజుల పాటు అందుబాటులో లేకుండా పోయింది. పోలింగ్ ముగియటంతో మంగళవారం ప్రభుత్వ మద్యం దుకాణాలను తిరిగి తెరిచారు. దీంతో మందు కోసం ఉదయం 8 గంటల నుంచి ముదినేపల్లి మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద జనం బారులు తీరారు. షాపులు తెరవగానే మందుబాబులు మద్యం కోసం ఎగబడ్డారు. ముదినేపల్లిలోని మద్యం దుకాణం వద్ద పెద్ద సంఖ్యలో మందు కోసం ఎగబడ్డారు. ఎన్నికల పుణ్యమా అని చేతిలో డబ్బు కూడా పుష్కలంగా ఉండటంతో మందు కోసం తెగ ఆరాట పడిపోయారు.

రోడ్డు ప్రమాదంలో మేనమామ, మేనల్లుడి మృతి

అక్కిరెడ్డిగూడెం వద్ద ఘటన

దెందులూరు, మే 14: మేనమామను మేనల్లుడు మోటార్ సైకిల్‌పై తీసుకువెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అక్కిరెడ్డిగూడెం వద్ద మంగళవారం మోటార్‌సైకిల్‌ను లారీ ఢీ కొంది. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేగివాడ గ్రామానికి చెందిన గుజ్జుల రంగారావు ఏలూరులో తన మేనల్లుడు గొర్రెల ప్రకాష్ ఇంటికి వెళ్లాడు. తిరిగి మేనమామ రంగారావును వేగివాడలో దింపేందుకు మంగళవారం ఉదయం మోటార్ సైకిల్‌పై ప్రకాష్ బయలుదేరాడు. అక్కిరెడ్డిగూడెం సమీపంలో లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గొర్రెల ప్రకాష్ లారీ కిందపడి అక్కడి క్కడే పడి మృతి చెందాడు. తీవ్ర గాయాలైన రంగారావును ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్స్ అందుబాటులో లేదు. స్థానిక టీడీపీ నేతలు ఆటోలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. రంగారావు చికిత్స పొందు తూ మృతి చెందాడు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూజివీడు కోటలో...

పాగా వేసేదెవరు?

పెరిగిన ఓటింగ్ శాతం

నూజివీడు, మే 14: నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో పోలింగ్ జరిగింది. నూజివీడు అసెంబ్లీలో రెండు లక్షల 38 వేల 981 మంది ఓటర్లు ఉండగా, దీనిలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 87.94 శాతం ఓట్లు పోలయ్యాయి. వీరిలో 1,05,054 మంది పురుషులు, 1,05,105 మంది స్త్రీలు, థర్డ్ జెండర్ ఇద్దరు, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నూజివీడు మండలం అన్నవరం గ్రామంలోని బూత్ నెంబర్ 122లో అత్యధిక ఓటర్లు 98.61 శాతం మంది ఓటు వేయగా, అతి తక్కువ పోలింగ్ జరిగిన బూత్ నూజివీడు పట్టణంలోని గొడుగువారిగూడెం బూత్ నెంబర్ 160లో 63.77 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. 2019 సాధారణ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 86.93 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. 2019 కన్నా 1.1శాతం అధికంగా ఓట్లు పోల్ అయ్యాయి.



గెలుపుపై ఎవరి ధీమా వారిదే...

నూజివీడు నియోజకవర్గంలో వైఎస్సార్ పార్టీ నేతలు, తెలుగుదేశం పార్టీ నేతలు ఎన్నికల్లో గెలుపుపై ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో 86 శాతం ఓట్లు పోల్ అయినప్పుడు అప్పటి అధికార పార్టీ అయిన తెలుగుదేశం ఓటమి చెందింది. ఇప్పుడు తాజాగా 2024లో 87 శాతంకు పైగా పోలింగ్ అయిన దృష్ట్యా ఇప్పటి అధికారపార్టీ అయిన వైఎస్సార్‌పార్టీ రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ అధికారం కోల్పోతుందనే ఆశాభావంతో తెలుగుదేశం వర్గాలు ఉన్నాయి. అధికారపార్టీ దురాగతాలు, అభివృద్ధి లేకపోవడం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, స్థానిక శాసనసభ్యుడిపై ఉన్న అసంతృప్తి తమను ఈ సారి విజయతీరాలకు చేరుస్తాయనే ఆశాభావంతో టీడీపీ ఉంది. కింది వర్గాల్లో జగన్‌పై ఉన్న అభిమానం, సంక్షేమ పథకాలు, మహిళలకు అందిన తాయిలాలు, మరోసారి తమను గట్టెక్కిస్తాయనే ఆశాభావంతో వైసీపీ ఉంది. ప్రజల తీర్పును బాక్సుల్లో నిక్షిప్తం చేసేశారు. జూన్ 4న ప్రజా తీర్పు వెలువడనుంది. అప్పటి వరకు ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు ఎవరి ఊహాగానాల్లో వారు తేలియాడాల్సిందే. వరుసగా మూడోసారి వైసీపీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గెలిచి మీసం తిప్పుతారా? లేదా కొత్తగా నూజివీడు నియోజక వర్గంలోకి వచ్చిన తెలుగుదేశం అభ్యర్థి కొలుసు పార్థసారథి నూజివీడు కోటపై విజయం సాధించి చక్రం తిప్పుతారా? అనేది నియోజకవర్గంలో ఆసక్తికరంగా మారింది.

ముసునూరు మండలంలో 90.37 శాతం పోలింగ్

ముసునూరు: ముసునూరు మండలంలో 90.37 శాతం పోలింగ్ నమోదైనట్టు తహసీల్దార్ జవహర్ బాజి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పలు గ్రామాల్లో రాత్రి 11గంటల వరకు పోలింగ్ జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 57 పోలింగ్ కేంద్రాల్లో 45,537 మంది ఓటర్లు ఉండగా 41,155 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, వీరిలో పురుషులు 20,858 మంది, స్త్రీలు 20,297మంది ఉన్నారని ఆయన తెలిపారు. చిన్న చిన్న సంఘటనలు మినహా మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, ఈవీఎంలను పటిష్ఠ బందోబస్తుతో ఏలూరుకు తరలించినట్లు తహసీల్దార్ తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ 67.27శాతం నమోదు కాగా ఈ ఎన్నికలకు 23.1శాతం పెరిగి, 90.37శాతం నమోదైంది.

చాట్రాయి మండలంలో 82 శాతం పోలింగ్

చాట్రాయి: చాట్రాయి మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ 82 శాతం జరిగినట్లు తహసీల్దార్ మహ్మద్ ముక్సూద్ అలీ తెలిపారు. మండలంలో 18 గ్రామ పంచాయతీలలో ఉన్న 51 పోలింగ్ కేంద్రాలు పరిధిలో మొత్తం 43,322 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 21,667 మంది, స్త్రీలు 21,654 మంది ఉన్నారని, వీరిలో 35,524 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు వివరించారు.

ఆగిరిపల్లి మండలంలో పోలింగ్ 89.3శాతం పోలింగ్

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలంలో పోలింగ్ 89.3శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 50,511 మంది ఓటర్లకు గాను 45,125 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అర్ధరాత్రి వరకు పోలింగ్..

కైకలూరు నియోజకవర్గంలో 88 శాతం పోలింగ్ నమోదు

గత ఎన్నికల కంటే ఒక శాతం తక్కువ నమోదు.. అయినా

గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన ఓటింగ్ శాతం



క్యూ లైన్లో బారులు తీరిన ఓటర్లు

కైకలూరు, మే 14: కైకలూరు నియోజకవర్గంలో పోలింగ్ సరళి గతంతో పోల్చుకుంటే ఒక శాతం తక్కువగా నమోదైంది. గతంలో కంటే 9534 ఓటర్లు కొత్తగా చేరినప్పటికీ, పోలింగ్ ఒక శాతం తగ్గినప్పటికీ ఓటర్లు ఉత్సాహంగానే ఓట్లు వేసేందుకు ఉదయం నుంచి బారులు తీరారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని చైతన్యవంతంగానే ఓటు హక్కును వినియోగించుకున్నారు. మార్పు కావాలంటూ అనేకమంది ఉదయమే పోలింగ్ బూత్‌కి వచ్చి క్యూ లైన్లో బారులు తీరి నిలబడ్డారు. గతంలో ఎప్పుడూ అర్ధరాత్రి వరకు నియోజకవర్గంలో ఎన్నికలు జరిగిన దాఖలాలు కన్పించలేదు. ఈవీఎంలు కొంత మేర మొరాయించినప్పటికీ, వేసవి ఎండ వేడిని తట్టుకోలేక ఎక్కువ మంది ప్రజలు మధ్యాహ్నం నుండి తమ ఓటు హక్కును వినియోగించుకు నేందుకు గంటల తరబడి పోలింగ్ బూత్‌లలో బారులు తీరారు. గతంలో కంటే ఈ ఏడాది ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఓటర్లు సైతం తమ ఓటు హక్కును వినియోగించడం వల్లనే గ్రామీణా ప్రాంతాల్లో పోలింగ్ 96 శాతం నమోదు అయింది. గత ఎన్నికల్లో 1,95,844మంది ఓటర్లకు గాను 1,73,450మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 89 శాతం నమోదు అయింది. 2024వ సంవత్సరంలో 2,05,604ఓట్లుకు గాను 1,79,536 ఓట్లు పోల్ అయ్యాయి. గ్రామీణా ప్రాంతాల్లో 90 శాతానికి పైగా 72 బూత్‌లలో పోలింగ్ జరిగింది. గత ఎన్నికల్లో కంటే అత్యధికంగా గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు. కైకలూరు నియోజకవర్గంలో 87.32 శాతం ఓట్లు నమోద య్యాయి. వీటిలో అత్యధికంగా ముదినేపల్లి మండలం 90 శాతం, అత్యల్పంగా కైకలూరు మండలం 85 శాతం, కలిదిండి, మండవల్లి మండలాలు 88 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. వీటిలో అత్యధికంగా ముదినేపల్లి మండలం పెనుమల్లి, చిన్నకామనపూడి గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లలో 96 శాతం పోల్ అయ్యాయి. అత్యల్పంగా పోల్ అయిన బూత్‌లలో కైకలూరులోని 116వ బూత్‌లో అత్యల్పంగా 70.02 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. కైకలూరు నియోజకవర్గంలో 2,05,604 మంది ఓటర్లకు గాను 1,79,536 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో అత్యధికంగా మహిళలు 90,151 ఓట్లు పోల్ అవగా పురుషులు 89,384 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతరులు ఒక ఓటు నమోదు అయింది. మండవల్లి మండలంలో 39,212 ఓట్లుకు గాను 34,421 ఓట్లు పోల్ అవ్వగా 88 శాతం నమోదైంది. ముదినేపల్లి మండలం 49,377 ఓట్లుకు గాను 44,108 ఓట్లు పోల్ అవ్వగా 90 శాతం నమోదు అయింది. కైకలూరు మండలం 60,200ఓట్లుకు గాను 51,165ఓట్లు పోల్ అవ్వగా 85 శాతం నమోదు అయింది. కలిదిండి మండలం 56,815 ఓట్లుకు గాను 49,842 ఓట్లు పోల్ కాగా 88 శాతం పోలింగ్ నమోదు అయింది. గతంలో కంటే ఈ ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదు అయింది. ఓటర్లను పోలింగ్ కేంద్రానికి తీసుకురావడంలో రాజకీయ నాయకులు చేసిన కృషి ఫలించిందనే చెప్పవచ్చు. కైకలూరు మండలంలో వింజరం, పందిరి పల్లిగూడెం, శృంగవరప్పాడు గ్రామాల్లో, మండవల్లి మండలం పెరికేగూడెం గ్రామంలో అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. వింజరం గ్రామంలో ఓటు వేసేందుకు వచ్చిన ఒక వ్యక్తి పోలింగ్ కేంద్రం వద్దే మృతి చెందడంతో పాటు ఈవీఎం కొద్దిసేపు మొరాయించడం, ఈవీఎం స్లిప్పులు లేకపోవడంతో అధికారులు అందించడానికి ఎక్కువ సమయం తీసుకోవడంతో అర్ధరాత్రి వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. పురుషులు కంటే 767 మంది మహిళలు ఎక్కువ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలకు తరలింపు..

కైకలూరు నియోజకవర్గంలోని 235 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలను ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలకు పోలీసు బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూంకు తరలించారు. ఈవీఎంలను కైకలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె. భాస్కర్, ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, ఎన్నికల సిబ్బంది స్ట్రాంగ్ రూంలలో మంగళవారం ఉదయానికి భద్రపరిచారు. స్ట్రాంగ్ రూంల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

మండవల్లిలో గరిష్ఠ స్థాయిలో పోలింగ్

మండవల్లి: మండవల్లి మండలంలో 39,212 మంది ఓటర్లు ఉండగా 34,621 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులకు దీటుగా మహిళలు క్యూలో నిలబడి అధిక శాతం ఓటింగ్ నమోదు చేయించు కున్నారు. 17,174 మంది పురుషులు కాగా 17,277 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగా ఓటు హక్కు సాధించిన యువ తతో పాటు పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు ఎంతో ఉత్సా హంగా గంటల కొద్ది క్యూలైన్లో నిలబడి ఓటు హక్కులో పాల్గొనడంతో ఫలి తాలపై ఉత్కంఠ నెలకొంది. అయితే కూటమి, వైసీపీ నాయకులు గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. మండవల్లిలోని కొన్ని ప్రాంతాల్లో వైసీ పీ డబ్బులు పంపకాన్ని నిలిపివేయడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓట ర్లను కూడా వైసీపీ పట్టించుకోకపోవడం ఆ పార్టీకి నష్టం చేకూరుస్తాయన్న చర్చ జరుగుతోంది.

ప్రయాణం.. నరకం

మూడేళ్ళ క్రితమే ఆర్భాటంగా ఎమ్మెల్యే శంకుస్థాపన

బిల్లుల పెండింగ్‌తో ముందుకు రాని కాంట్రాక్టర్

నూజివీడు ఏలూరు ప్రధాన రహదారిపై జనం పాట్లు



సింహాద్రిపురం వద్ద ఉన్న పెద్ద గుంతలు

వైసీపీ ఐదేళ్ళ పాలనలో రహదారుల అభివృద్ధి లేక వాహనదారులు, పాదచారులు నరకం చూస్తున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి తమ ప్రభుత్వంలోనే జరుగుతుందంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న అధికార పార్టీ నాయకులు, సీఎం జగన్‌కు అధ్వానంగా ఉన్న రహదారులు కనిపించడం లేదా అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముసునూరు, మే 14: జిల్లా కేంద్రమైన ఏలూరుకు నూజివీడు నుంచి ముసునూరు మండలంలోని పలు గ్రామాల మీదుగా వెళ్ళే ప్రధాన రహదారి అభివృద్ధిని స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విస్మరించారనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. మూడేళ్ళ క్రితం ఏలూరు ప్రధాన రహదారి విస్తరణ, అభివృద్ధికి రూ 43.70 కోట్ల నిధులు మాంజూరయ్యాయి. ఎమ్మెల్యే ప్రతాప్ ఆర్భాటంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. అయితే 23 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రహదారికి ఇరుపక్కలా మీటర్ వెడల్పులో చిప్స్ వేసి, తారువేసి అభివృద్ధి చేయాల్సి ఉంది. వేల్పుచర్ల నుంచి కొంత మేరకు రహదారికి ఇరువైపులా చిప్స్ వేసే పనులను రెండేళ్ళ క్రితం చేసి, కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపేశారు. చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రూ. 2 కోట్లు చెల్లింపులు జరిగినట్లు అధికారులు అంటున్నారు. నాటి నుంచి నేటి వరకు ఈ రహదారి అభివృద్ధి పనులు చేపట్టలేదు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు సైతం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ రహదారి అడుగడుగునా ఉన్న గుంతల వల్ల అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. సింహాద్రిపురం, గోపవరం, ముసు నూరు, వేల్పుచర్ల తదితర గ్రామాల ప్రధాన కూడళ్ళలో ఉన్న గుంతల వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రాణాలు పోతున్నప్పటికీ రహదారి అభి వృద్ధి గురించి పట్టించుకున్న నాథుడే లేడని వాహనదారులు, ప్రజలు ప్రభుత్వ పనితీరు, పాలకులపై మండి పడుతున్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేయడం వల్ల కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని, ఉన్నతాధికారులు నోటీసులు పంపినా స్పందన లేదని ఆర్అండ్‌బీ అధికారులు చెప్పడం విశేషం. అభివృద్ధిని ఆమడ దూరం పెట్టిన ప్రభుత్వానికి కాలం చెల్లినట్టేనని ప్రజలు, వాహనదారులు బహిరంగంగా అంటున్నారు.

ఎమ్మెల్యేకు పట్టని రహదారి అభివృద్ధి...



నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన స్థానిక ఎమ్మెల్యే మాత్రం రహదారి అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రానికి వెళ్ళే రోడ్డు అధ్వానంగా ఉంటే, నిధులు మంజూరైనా అభివృద్ధి చేయలేని దుస్థితిలో ఎమ్మెల్యే ఉన్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారి నుంచి రాకపోకలు సాగిస్తున్నారే తప్ప, రహదారి అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదు.

- తులిమెల్లి రంగరావు, ముసునూరు

ఈ రహదారిపై ప్రయాణం నరకం



ఏలూరు ప్రధాన రహదారిపై ప్రయాణం నరకమే. గ్రామాల ప్రధాన కూడళ్ళలో ఉన్న పెద్ద పెద్ద గుంతులు, వర్షం పడితే చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. వీటి లోతు తెలియని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారి అభివృద్ధి గురించి మాత్రం ప్రభుత్వం, పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా కేంద్రానికి వెళ్ళే ఈ ప్రధాన రహదారిని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలి.

-ఆవుల బాబూరావు, సింహాద్రిపురం

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

కుక్కునూరు, మే 14: దామరచర్లలో మంగళవారం ఉపాధి కూలీలు చెరువు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో తేనెటీగలు ఒక్కసారిగా చెదిరి ఉపాధి కూలీలపై దాడి చేశాయి. ఈ దాడిలో 20మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి.

ఓట్లు ఎవరికి పడ్డాయబ్బా..

లెక్కల్లో నిమగ్నమైన నాయకులు



చాట్రాయి, మే 14: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియటంతో టీడీపీ, వైసీపీ గ్రామ, మండల స్థాయి నాయకులు ఓట్ల లెక్కల్లో నిమగ్నమయ్యారు. నిన్నటి వరకు కార్యకర్తలు అభిమానులతో సందడిగా కన్పించిన నాయకుల ఇళ్ళు, పార్టీల కార్యాలయాలు జనం లేక బోసిపోయాయి. నెల రోజులుగా అభ్య ర్థుల పర్యటనలు, నాయకులు ఇంటింటి ప్రచారాలు, మైక్ అనౌన్స్‌మెంట్లతో హోరెత్తించగా, ఇప్పుడు గ్రామాల్లో అంతటా నిశ్శబ్దం నెలకొంది. టీడీపీ, వైసీపీ గ్రామ, మండల స్థాయి నాయకులు పోల్ మేనేజ్‌మెంట్‌లో పాల్గొన్న ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు జరిపి వార్డులు, సామాజిక వర్గాల వారీగా వచ్చే మెజారిటీ, మైనస్ గురించి సుదీర్ఘంగా చర్చించి ఒక అంచనాకు వస్తున్నారు. తమ గ్రామంలో, మండలంలో వచ్చే ఓట్ల వివరాల అంచనాలను అభ్యర్థులకు నాయకులు అందజేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు సైలెంట్ గా ఓట్లు వేయటం వల్ల జనం నాడి నాయకులకు అందటం లేదు. అయినా గెలుపు తమదేనని ఇరు పార్టీలు ధీమా వ్యక్తం చేయటం గమనార్హం. గత కొద్ది నెలలుగా జిల్లాలో, రాష్ట్రంలో ఎక్కడా వైసీపీ, టీడీపీ సభలు సమావేశాలు జరిగినా వ్యయ ప్రయాసలను లెక్కచేయకుండా హాజరవుతూ తీరిక లేకుండా గడిపిన నాయకులు కార్యకర్తలు రిలాక్స్ మూడ్‌లోకి వచ్చారు. నూజివీడు అసెంబ్లీ, ఏలూరు పార్లమెంట్ సీట్లపైనా, కూటమి ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని, వైసీపీ సర్కార్ వస్తుందని, రాష్ట్రంలో ప్రముఖులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల పైనా పందేలు జోరుగా జరుగుతున్నాయి. ఈసారి పోలింగ్‌కు, ఓట్ల లెక్కింపునకు 20 రోజుల వ్యవధి ఉండటంతో ఫలితాలు ఎలా ఉంటాయోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

సమాచార సేకరణలో నాయకులు..

ముదినేపల్లి రూరల్: నెల రోజులుగా ఎన్నికల బిజీలో క్షణం తీరిక లేకుండా ఉన్న గ్రామ, మండల స్థాయి నాయకులు మంగళవారం రిలాక్స్ అయ్యారు. గ్రామాల వారీగా బూత్‌లలో ఏ మేరకు మెజార్టీ వస్తుందని మండల, గ్రామ స్థాయి నాయకులు ద్వారా సమాచారం తెప్పించుకుంటూ బేరీజు వేసుకుంటున్నారు. వడాలి, గురజ, పెనుమల్లి, శ్రీహరిపురం, చేవూరు పాలెం, కోడూరు, సింగరాయపాలెం, పెదగొన్నూరు, ఉప్పరగూడెం బూత్‌లలో 300 నుంచి 600 వరకు మెజార్టీ వస్తుందని టీడీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బొమ్మినంపాడు, నారాయణపురం, వాడవల్లి, ఊటుకూరు, వి.రావిగుంట, చిన్నపాలపరు, ములకలపల్లి గ్రామాల్లో అధికార పార్టీకి అను కూలంగా ఓట్లు పడినట్లు సమాచారం. మిగిలిన గ్రామాల్లో ఎన్‌డీఏ అభ్యర్థికి మెజార్టీ వచ్చే అవకాశం ఉందని గ్రామస్థాయి నాయకులు అంచనా వేస్తున్నారు. మహిళా ఓటర్లు అధిక శాతం చంద్రబాబునాయుడు మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొని కూటమి అభ్యర్థికి ఓట్లు వేశారని గ్రామాల్లో చర్చ జరుగుతోంది.

రూ. 5 నుంచి 5 వేలకు!

50 ఏళ్లలో పెరిగిన ఓటు రేటు



ముదినేపల్లి, మే 14 : ఓటు రేటు బాగా పెరిగింది. గత 50 ఏళ్లలో ఓటు ధర ఎన్నో రెట్లు పెరిగింది. 1972 సార్వత్రిక ఎన్నికల్లో కొన్ని చోట్ల రాజకీయ పార్టీలు ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఓటు కొనుగోలు విధానం విజయ వంతంగా కొనసాగుతున్నది. అప్పట్లో అభ్యర్థులు రూ.5 తో ఓటుకు ధర నిర్ణయించగా, ఇప్పుడు రూ.1000 నుంచి రూ.5 వేల వరకు పెరిగింది. అభ్యర్థుల ఆర్థిక పరిస్థితిని బట్టి ఓటుకు ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో విధం గా ఉంటున్నది. 1978లో రెడ్డి కాంగ్రెస్, ఇందిరా కాంగ్రెస్, జనతా పార్టీలు పోటీ చేసినప్పుడు ఎన్నికల ప్రతిష్ఠాత్మకంగా మారటంతో ఓటు రేటును రూ.15కు పెంచారు. అనంతరం టీడీపీ, కాంగ్రెస్ హోరాహోరీ పోరు ప్రారంభం కావటం తో ఈ రేటు రూ.50కి చేరింది. అప్పటి నుంచి ధనవంతులు రాజకీయ రంగ ప్రవేశం చేసి పోటీ చేయటం ప్రారంభమయ్యాక ఓట్ల కొనుగోలు విచ్చలవిడిగా పెరుగుతున్నది. దీంతో ఓటు రేటు 2014లో రూ.500లు పలుకగా, 2019లో వెయ్యికి చేరింది. ఈ సార్వత్రిక ఎన్నికలకు ఆ రేటు గరిష్ఠ స్థాయికి చేరి రూ.5 వేలకు పెరిగింది. అయితే ఇక్కడ విశేషమేమిటంటే ఓటు కలిగిన ఓటరు ఈ రేటును పెంచటం కాకుండా కొనుగోలు చేసే నాయకులే పెంచేస్తున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థికి ఓట్ల కొనుగోలుకే సగటున రూ.30 కోట్లు ఖర్చు అవుతున్నట్లు అంచనా. భవిష్యత్తులో ఈ రేటు ఏ స్థాయికి చేరుతుందో?

కాయ్ రాజా కాయ్

ముదినేపల్లి, మే 14 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియటంతో ఫలితాలు, మెజారిటీలపై పందెం రాయుళ్ళ రంగంలోకి దిగారు. ప్రభుత్వం ఏర్పాటు, పలు నియోజకవర్గాల ఫలితాలపై ముదినేపల్లి ప్రాంతంలో పందేలు జరుగుతు న్నాయి. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని పలువురు పందేలు కడుతుండగా, వైసీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలో వస్తుందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పందేలకు దిగుతున్నారు. ఏ పార్టీకి ఎన్ని అసెంబ్లీ సీట్లు వస్తాయన్న అంశంపై కూడా పందేలు కడుతున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం వివిధ ప్రాంతాల్లో ఆయా పార్టీల పరిస్థితిపై సమాచారం సేకరించి బెట్టింగులకు దిగుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ గెలుపుపై కూడా పెద్ద ఎత్తున పందేలు జరుగు తున్నాయి. పిఠాపురంలో పవన్ కల్యాణ్ గెలుపుపైనే కాక 70 వేల ఓట్లపైగానే మెజారిటీ వస్తుందని పెద్ద ఎత్తున పందేలు కడుతున్నారు.



పెదగొన్నూరులో నీరు లేని పుట్లమ్మ చెరువు

పశువులకు తాగునీరేదీ?

చెరువుల్లో అడుగంటి పసర్లు కక్కుతున్న నీరు

ముదినేపల్లి, మే 14 : ముదినేపల్లి మండలంలో పశువుల చెరువుల్లో నీరు అడుగంటింది. పలు గ్రామాల్లో పశువులకు తాగునీరు కరువైంది. ఇటీవల కాల్వలకు నీరు వదిలిన సమయంలో మండలంలో మంచినీటి చెరువులను మాత్రమే నింపుకోవాలని అధికారులు ఆదేశించటంతో పంచాయతీల కార్యదర్శులు పశువుల చెరువులను నింపే అవకాశం లేకుండా పోయింది. మండలంలోని ప్రతి గ్రామంలోనూ పశువుల చెరువుల్లో నీరు అడుగంటింది. ఆ నీరు కూడా పూర్తిగా రంగు మారి దుర్వాసన వెదజల్లుతుండటంతో పశు పోషకులు తమ పశువులకు తాగునీరు అందక దిక్కు తోచని స్థితిలో పడ్డారు. మంచినీటి చెరువుల నుంచి నీరు తెచ్చి పశువులకు అందిస్తున్నారు. వేసవిలో పశువుల తాపం తీర్చుకునేందుకు చెరువుల్లో నీటిని పుష్కలంగా నింపేవారు. ఈ ఏడాది ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. గతంలో మురుగు కాల్వల్లో నీటినైనా పశువుల తాగేవి. ఇప్పుడు డ్రైన్లలో కూడా నీరు లేదు. ఈ పరిస్థితుల్లో పశువుల చెరువుల్లో నీరు లేకపోవటం ఆందోళన కలిగిస్తున్నది. కాల్వలకు నీరు విడుదల చేసే వరకు పశువులకు తాగునీరు ఎలా అన్నది ప్రశ్నార్థకం.


జోహార్ నరేంద్ర అన్న
మృధుస్వభావి.. ఆత్మీయనురాగాలకు నిలువెత్తు రూపం...
ప్రముఖ వ్యాపార వేత్త..
శ్రీ అట్లూరి
వెంకట జితేంద్ర గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు..
గోగినేని ఆదిత్య
నూజివీడు
గోగినేని మధు కిరణ్
ఏలూరు పార్లమెంట్ తెలుగుయువత
ఆర్గనైజేషన్ సెక్రటరీ, నూజివీడు